
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 3 డిసెంబరు 2024



గజలక్ష్మి నమోస్తుతే!





సోమవారం రాత్రి 7 గంటల నుంచి గజవాహనసేవ నయనానందకరంగా సాగింది. బంగారుకాసుల హారాన్ని ధరించిన అమ్మవారు గజవాహనంపై శ్రీ మహాలక్ష్మి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అత్యంత ప్రీతిపాత్రమైనది గజవాహనం. ఐశ్వర్యానికి ప్రతిరూపమైన గజవాహనంపైన కొలువుదీరిన అమ్మవారు తిరువీధుల్లో ఊరేగుతూ భక్తజన హృదయాలను రంజింపచేశారు. కీలుగుర్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటాలు, చెక్కభజనలు, జీయర్ల పరివారం ప్రబంధ పారాయణం చేస్తుండగా గజవాహనసేవ మాడవీధుల్లో సాగింది.

నేడు స్వర్ణ రథోత్సవం, గరుడోత్సవం

మంగళవారం అమ్మవారి స్వర్ణ రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. సాయంత్రం 4.20 నుంచి 5.20 గంటల మధ్య అమ్మవారు స్వర్ణరథంపై కొలువుదీరి తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. అలాగే రాత్రి అమ్మవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. శ్రీవారి పాదాలను అమ్మవారికి అలంకరిస్తారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

వరద నష్టం

వరద ప్రభావానికి గురైన గ్రామాలు: 240
దెబ్బతిన్న ఆర్‌అండ్‌బీ రోడ్లు: 6 (120కి.మీ.)
దెబ్బతిన్న పంచాయతీ రోడ్లు: 8 (34.72కి.మీ.)
కూలిన కరెంటు స్తంభాలు: 198
తక్షణ మరమ్మతులకు అవసరమైనది: రూ. 367 లక్షలు
శాశ్వత మరమ్మతులకు: రూ.1346 కోట్లు

పొంచివున్న వరద ముప్పు

- వాన తగ్గినా పెరిగిన ప్రవాహాలు
- పొంగిన ఉప్పుటేరు, రొయ్యల కాలువ, బకింగ్ హామ్
- పలు మార్గాల్లో ఆగిన రాకపోకలు
- ప్రమాదకర స్థితిలో స్వర్ణముఖి కరకట్ట
- రిజర్వాయర్లలోకి చేరుతున్న వర్షపు నీరు
- 10,200 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు



దొరవారిసత్రం మండలం ఉచ్చూరులో ఇసుక మేటతో పాటు నీటిలో ఉన్న వరి పొలం

ఫెంగల్ తుఫాను బలహీనపడి వానలు తగ్గినా జిల్లాలో వాగులు, వంకల ప్రవాహాలు మాత్రం తగ్గలేదు. ఉరకలెత్తి ఉధృతంగా పారుతున్నాయి. పలుచోట్ల రోడ్లను అడ్డగిస్తున్నాయి. రాకపోకలకు అవరోధం కలిగిస్తున్నాయి. స్వర్ణముఖి, కాళంగి, అరణియార్‌లు జలకళలాడుతున్నాయి. మరోవైపు ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారాయి. వాన జోరు పెరిగితే మాత్రం ముప్పు అంచున ఉన్న అనేక గ్రామాలకు ప్రమాదం వాటిల్లే అవకాశం ఉంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

ఉధృతంగా బకింగ్ హామ్



కోట మండలం గోవిందపల్లె వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న బకింగ్‌హామ్ కెనాల్

కోట మండలంలో సోమవారం బకింగ్ హామ్ కెనాల్ ఉధృతి పెరిగింది. దీంతో గోవిందపల్లి, గోవిందపల్లి పాలెం గ్రామాల నడుమ రాకపోకలు స్తంభించాయి. చిల్లకూరు మండలంలో భారీ వర్షాలకు సోమవారం సాయంత్రం ఉప్పుటేరు పొంగింది. తిప్పగుంట పాలెం చప్టాపై నీటి ప్రవాహం పెరగడంతో వంద కుటుంబాలు చిక్కుకుపోయాయి. చిట్టమూరు మండలంలో సోమవారం కూడా మోస్తరు వర్షం కురిసింది. గత మూడు రోజుల వర్షానికి సోమవారం రొయ్యల కాలువ ఒక్కసారిగా పొంగింది. దీంతో మల్లాం-కొత్తగుంట నడుమ రాకపోకలు ఆగిపోయాయి.

ప్రమాదంలో స్వర్ణముఖి కరకట్ట

బ్యారేజీ నుంచీ దిగువకు నీటి ప్రవాహం ఉధృతంగా సాగుతున్న కారణంగా సోమవారం కోట మండలం దైవాల దిబ్బ వద్ద స్వర్ణముఖి నది కరకట్ట తెగిపోయే ప్రమాదం ఏర్పడింది. కరకట్ట తెగిపోతే కోట మండలంలోని పుచ్చలపల్లి, దైవాల దిబ్బ గ్రామాలతో పాటు వాకాడు మండలం గంగనపాలెం గ్రామాలు నీట మునిగే ప్రమాదముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సోమవారం కోట మండల తహసిల్దారు పది ట్రాక్టర్లతో గ్రావెల్ తోలించినా ఉపయోగం లేకపోయింది. ఇరిగేషన్ అధికారులు సరిగా స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు.



కోట మండలం దైవాలదిబ్బ వద్ద దెబ్బతిన్న స్వర్ణముఖి కరకట్ట

వాకాడు మండలంలో 12 గ్రామాలకు ముప్పు



వాకాడు స్వర్ణముఖి బ్యారేజీ నుంచి నీటి ఉధృతి

వాకాడు మండలంలోని స్వర్ణముఖి బ్యారేజీలోకి ఆదివారం 18 వేల క్యూసెక్కుల నీరు చేరగా, సోమవారం 15 వేల క్యూసెక్కులకు తగ్గింది. బ్యారేజీ పూర్తిగా నిండిపోయి వున్నందున వచ్చిన నీటిని వచ్చినట్టే సముద్రంలోకి వదిలిపెట్టేస్తున్నారు. ఇక గంగనపాలెం-బాలిరెడ్డిపాలెం నడుమ వంతెనపైకి నీరు చేరడంతో 12 గ్రామాలకు రాకపోకలు ఆగిపోయాయి. మరో రెండు రోజుల పాటు పరిస్థితి ఇలాగే వుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా వంతెన వద్ద ఇరువైపులా కోతకు గురి కాకుండా భారీగా ఇసుక బస్తాలు పేర్చారు.

మల్లిమడుగులో పది గేట్లు ఎత్తేశారు

రేణిగుంట మండలంలోని మల్లిమడుగు రిజర్వాయర్‌కు కూడా వరద నీరు భారీగానే చేరుతోంది. రిజర్వాయర్ పూర్తిగా నిండిపోవడంతో ఇన్‌ఫ్లో 2 వేల క్యూసెక్కులుండగా అంతకంటే ఎక్కువగా 2100 క్యూసెక్కుల నీటిని పది గేట్లు ఎత్తివేసి దిగువకు విడుదల చేస్తున్నారు.

కళ్యాణి డ్యాంలోకి నీరు



కళ్యాణి డ్యామ్‌లోకి మొదలైన నీటి చేరిక

జిల్లాలో దాదాపుగా అన్ని రిజర్వాయర్లలోకీ వర్షపు నీరు చేరుతోంది. కళ్యాణి డ్యామ్‌లోకి శేషాచల అడవుల నుంచీ నుంచీ నీరు వస్తోంది. చంద్రగిరి మండలంలోని ఈ డ్యామ్ లోతు 910 అడుగులు కాగా ఆదివారం వరకూ 841 అడుగుల వరకూ వున్న నీటిమట్టం వర్షపు నీటి ప్రవాహం మొదలు కావడంతో సోమవారం 853 అడుగులకు చేరింది.

నిండుకుండలా అరణియార్

పిచ్చాటూరు మండలంలోని అరణియార్ రిజర్వాయర్ నిండుకుండలా మారింది. జిల్లాలోనే అతి పెద్ద రిజర్వాయర్ అయిన అరణియార్ నీటి నిల్వ సామర్థ్యం 1.85 టీఎంసీలు. ఇపుడు అందులో 1.74 టీఎంసీల నీరు చేరింది. 31 అడుగుల లోతు కలిగిన రిజర్వాయర్‌లో ఇప్పటికే 29.5 అడుగుల ఎత్తున నీరు చేరింది. రిజర్వాయర్‌లోకి 4 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండగా ఒక గేటు తెరిచి వెయ్యి క్యూసెక్కులు దిగువకు విడుదల చేస్తున్నారు. సోమవారం మండలంలో భారీ వర్షం కురవడంతో రాత్రికే రిజర్వాయర్ పూర్తిగా నిండిపోవచ్చునని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఉరకలెత్తుతున్న కాళంగి

కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్ మొత్తం నీటి మట్టం 240 అడుగులకు గానూ సోమవారం సాయంత్రానికి 219 అడుగులకు నీరు చేరింది. 2830 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి వస్తుండగా మొత్తం 18 గేట్లకు గానూ ఆరు గేట్లు ఎత్తి 2260 క్యూసెక్కుల నీటిని కిందకు వదిలిపెడుతున్నారు.

దెబ్బతిన్న పంటలు



దొరవారిసత్రం మండలం కొత్తపల్లిలో ఇసుక మేట వేసిన వేరుశనగ పొలం (ఇన్‌సెట్‌లో) ఆనేపూడిలో మొలకెత్తిన వేరుశనగ

జిల్లావ్యాప్తంగా ఫెంగల్ తుపాను ప్రభావంతో శుక్రవారం రాత్రి నుంచీ కురిసిన వర్షాలకు పంటలు భారీగా దెబ్బతిన్నాయి. ప్రాథమిక అంచనా మేరకు మొత్తం 10,200 ఎకరాల్లో వరి, వేరుశనగ పంటలకు నష్టం జరిగింది. రబీ సీజను ప్రారంభం కావడంతో ప్రధానంగా నారు దశలో ఉన్న వరి పంట నీట మునిగింది. వేరుశనగదీ అదే పరిస్థితి. దెబ్బతిన్న పంటలకు సంబంధించి 4338 మంది రైతులు నష్టపోయారు. సూళ్లూరుపేట, వరదయ్యపాళెం ప్రాంతాల్లో నీట మునిగిన పంటలు కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్ సోమవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అక్కడి రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకొన్నారు. ఇక, తుఫాను వల్ల ఒక ఎద్దు, ఒక ఆవు, నాలుగు దూడలు, నాలుగు గొర్రెలు మృతిచెందాయి. రెండు పక్కా ఇళ్ళు పాక్షికంగా దెబ్బతినగా మరో నాలుగు గుడిసెలు నేలమట్టమయ్యాయి.



పడమటి కండ్రిగ వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, పక్కనే ఆర్డీవో కిరణ్మయి, ఏవో కవిత, రైతులు

154 కి.మీ.ల మేర 14 రోడ్లు ధ్వంసం

పంచాయతీ రాజ్ శాఖ పరిధిలో 34.72 కిలోమీటర్ల మేర ఎనిమిది రోడ్లు దెబ్బతిన్నాయి. వీటి తాత్కాలిక మరమ్మతులకు రూ.31 లక్షలు, శాశ్వత రిపేర్లకు రూ.3.15 కోట్లు అవసరమని ఆ శాఖ అంచనా వేసింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో 120 కిలోమీటర్ల మేర ఆరు రోడ్లు పాడయ్యాయి. రోడ్ల ఉపరితం కొట్టుకుపోగా మరమ్మతులకు రూ.2 కోట్లు.. తాత్కాలిక రిపేర్లకు రూ. 60 లక్షలు.. శాశ్వత మరమ్మతులకు రూ.1342 కోట్లు అవసరమని ఆ శాఖ అధికారులు నివేదించారు.

విద్యుత్ శాఖకు రూ. కోటి నష్టం

ఎస్పీడీసీఎల్‌కు సంబంధించి 198 విద్యుత్ స్తంభాలు నేలకూలగా, 90 ట్రాన్స్‌ఫార్మర్లు ధ్వంసమయ్యాయి. 30 కిలోమీటర్ల మేర 11 కేవీ, ఎల్‌టీ విద్యుత్ తీగలు తెగిపోయాయి. మొత్తం సుమారు రూ. కోటి వరకు నష్టం ఉంటుందని అధికారులు అంచనా వేశారు.

తక్షణ అవసరం రూ.3.66 కోట్లు

ఫెంగల్ తుఫానుతో జరిగిన నష్టం అంచనా వేయడంలో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ప్రాథమిక సేకరించిన సమాచారం మేరకు జిల్లాలో 240 గ్రామాలు తుఫాను ప్రభావానికి గురయ్యాయి. పీఆర్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖలకు కలిగిన నష్టాలకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులకు రూ.3.66 కోట్లు.. శాశ్వత పనులకు రూ.1346 కోట్లు (గత తుఫానులో దెబ్బతిన్నవి కలిపి) కావాలని ప్రతిపాదించారు.

జడివాన

- ఓజిలిలో అత్యధికంగా 35.4 మి.మీ వర్షపాతం

తిరుపతి(కలెక్టరేట్), ఆంధ్రజ్యోతి: జిల్లాలో ఆదివారం కొన్ని మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలిలా.. ఓజిలి 35.4, పిచ్చాటూరు 21.2, రామచంద్రాపురం 20.8, తిరుపతి రూరల్ 18.4, రేణిగుంట 15.6, చంద్రగిరి 14, శ్రీకాళహస్తి 13.2, డక్కిలి 12.6, తిరుపతి అర్బన్ 12.4, తొట్టంబేడు 12.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు



రికార్డులను పరిశీలిస్తున్న అడిషనల్ ఐజీ విజయ్‌భాస్కర్

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ శాఖ అడిషనల్ ఐజీ విజయ్‌భాస్కర్ సోమవారం ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సాగిన తనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించారు. ఇటీవల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఆరోపణలు రావడంతో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు మరో మూడు రోజుల పాటు కొనసాగుతాయని ఏఐజీ తెలిపారు. మండల పరిధిలో ప్రభుత్వ, వివాదాస్పద భూములు రిజిస్ట్రేషన్ చేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. వాటి ఆధారంగా అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడి కార్యాలయానికి త్వరలోనే సీనియర్ సబ్ రిజిస్ట్రార్‌ను నియమించి ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా రిజిస్ట్రేషన్లు జరిగేలా చూస్తామన్నారు. అవినీతికి పాల్పడిన ఏ ఒక్కరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.

స్థానికులకు శ్రీవారి దర్శనం

- తిరుపతి, తిరుమలలో టోకెన్ల జారీ
- 3000 కోటాకు 2903 తీసుకున్న భక్తులు
- వైకుంఠ దర్శనాలకోసం తిరుమలలో 97 మంది వెనకడుగు



- 8లో

ఎస్వీయూ ఇంజనీరింగ్ కాలేజీలో 'అన్యమత' కలకలం

- ప్రచారం చేస్తున్నారంటూ ప్రొఫెసర్‌పై భజరంగదళ్, ఏబీవీపీ ఆరోపణ
- కారుపై దాడి
- అసభ్యంగా ప్రవర్తిస్తున్నారంటూ మహిళా ప్రొఫెసర్ కూడా ఫిర్యాదు



- వివరాలు 8లో

త్రుటిలో తప్పిన ప్రమాదం

- వాగులో కొట్టుకు పోతున్న ఉపాధ్యాయుడిని రక్షించిన స్థానికులు



ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడికి త్రుటిలో ప్రమాదం తప్పింది. రత్నకుమార్ రాజులకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు. విధులకు హాజరుకావడానికి ఉదయం 7.30గంటలకు గోవిందవరం నుంచి రాజులకండ్రిగకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఈ క్రమంలో దారిలో స్వర్ణముఖి వంక ఉంది. దాన్ని దాటుతుండగా అదుపు తప్పి కొద్ది దూరం కొట్టుకుపోయారు. దీనిని గుర్తించిన స్థానికులు సకాలంలో రత్నకుమార్‌ను ఒడ్డుకు చేర్చారు.

ఆర్టీసీకి రూ.80లక్షలు తగ్గిన రాబడి

తిరుపతి(ఆర్టీసీ), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో రెండు రోజుల్లో ఆర్టీసీకి దాదాపు రూ.80లక్షల రాబడి తగ్గినట్లు అధికారులు అంచనా వేశారు. వాగులు, వంకలు ప్రవహించడం, కల్వర్టులపై నీరుచేరడం, రోడ్లు కొట్టుకుపోవడం, ప్రయాణికుల రద్దీ లేకపోవడం వంటి కారణాలతో 25మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు ఆగిపోయాయి. 30వేల కిలోమీటర్లు రవాణా స్తంభించింది. రెండు రోజులుగా దాదాపు 40బస్సులు డిపోలకే పరిమితయ్యాయి. కొన్ని ఇతర మార్గాలకు దారి మళ్లించి నడిపినా పెద్ద ప్రయోజనం లేదు. వారాంతంలో బెంగళూరుకు, హైదరాబాదుకు నడిచే అదనపు బస్సులు కూడా ఆగిపోయాయి. మంగళవారం ఉదయం నుంచి యథావిధిగా బస్సులు నడపాలని డ్రైవర్లు, కండక్టర్లను అధికారులు ఆదేశించారు.

శివాలయాల్లో కార్తీక మాస పూజలు



ముక్కోటిలో ఘటాభిషేకంలో స్వామివారు



శ్యామల సమేత మల్లేశ్వరాలయంలో శాఖాంబరి అలంకరణలో స్వామివారు

చంద్రగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయాల్లో సోమవారం కార్తీకమాస పూజలు వైభవంగా నిర్వహించారు. తొండవాడ వద్ద స్వర్ణముఖి నది ఒడ్డున వెలసిన అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామికి రుద్రాభిషేకం, అనందవల్లి దేవికి అభిషేకం చేశారు. స్వామికి ఘటాభిషేకం నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్తీక సోమవారం కావడంతో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. ముక్కోటి ఆలయ ధర్మకర్త మొగిలి రఘునాథరెడ్డి పాల్గొన్నారు. చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయంలో ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారికి శాఖాంబరి అలంకరణ చేసి, భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ శైవాంగ పండితులు శివకుమార్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనంపై హర్షం

చంద్రగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానికుల శ్రీవారి దర్శనంలో చోటు కల్పించడంపై చంద్రగిరి మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో తిరుపతి ప్రజలను స్థానికులుగా పరిగణించి నెలలో ఒక రోజు తిరుమల శ్రీవారి దర్శనం కల్పించారు. అప్పటి నుంచి చంద్రగిరి ప్రజలు తమను కూడా స్థానికులుగా గుర్తించాలని, ఈ ప్రాంతంలో వేంకటేశ్వరస్వామి, పద్మావతమ్మలు నడియాడినట్లు శాసనాలు ఉన్నాయని కోరుతూ వచ్చారు. అప్పట్లో టీటీడీ అధికారులు, పాలకమండలి స్పందించలేదు. కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ ఈ ప్రతిపాదనను చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రభుత్వ పెద్దలు, టీటీడీ పాలకమండలి దృష్టికి తీసుకెళ్లారు. టీటీడీ పాలకమండలి సానుకూలంగా స్పందించడంతో చంద్రగిరి నియోజకవర్గ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది.

బాడీ బిల్డింగ్‌లో ముంగిలిపట్టు యువకుడికి గోల్డ్ మెడల్



చంద్రగిరి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాడీ బిల్డింగ్ పోటీల్లో చంద్రగిరి మండలం ముంగిలిపట్టు యువకుడు నిఖిల్ అలియాస్ నవీన్ గోల్డ్ మెడల్ సాధించాడు. త్రో గోల్డెన్ ఇండియా బాడీ బిల్డింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి తిరుపతి యూత్ హాస్టల్లో బాడీ బిల్డింగ్ పోటీలు నిర్వహించారు. 75 కేజీల బరువు గల పోటీలలో పది మంది యువకులు పాల్గొనగా నిఖిల్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించాడు. నిర్వాహకులు గోల్డ్ మెడల్ బహుమతిగా అందజేశారు. నిఖిల్ తిరుపతి ఎమ్మార్‌పల్లెలోని హెచ్‌కె ఫిట్‌నెస్ సెంటర్‌లో ట్రైనర్ హరికృష్ణ ఆధ్వర్యంలో శిక్షణ పొందాడు.

జీతాలివ్వాలని పంచాయతీ కార్మికుల నిరసన



తిరుపతి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జీతాలు చెల్లించాలని తిరుపతి రూరల్ మండలం గాంధీపురం గ్రామ పంచాయతీ కార్మికులు సోమవారం ఉదయం గ్రామ సచివాలయ ప్రధాన ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో అవస్థలు పడుతున్నామని తెలిపారు. తమ జీతాల నుంచి ప్రతి నెలా క్రమం తప్పకుండా పీఎఫ్ డబ్బు కట్ చేస్తున్నా దానికి సమానమైన పంచాయతీ(యాజమాన్యం) వాటా చెల్లించడంలేదని పేర్కొన్నారు. వీరికి స్థానిక టీడీపీ నేతలు ధనంజయయాదవ్, హేమలత, కృష్ణయ్య, పురంధర్, చందు, సుబ్బు, సాగర్, రమేష్ మద్దతు ప్రకటించి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇదిలాఉండగా పంచాయతీలో వైసీపీ, కూటమి పార్టీలకు చెందిన స్థానిక నేతల జోక్యం పెచ్చుమీరడంతో జీతాల బిల్లు పెట్టడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

టమోటా పంటపై ఏనుగుల దాడి



ధ్వంసమైన టమోటా పంటను పరిశీలిస్తున్న అధికారులు

భాకరాపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చిన్నగొట్టిగల్లు మండలంలో పది రోజులుగా పంటలపై ఏనుగుల దాడులు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి దిగవూరు పంచాయతీకి చెందిన బయ్యారెడ్డి టమోటా పంటను ధ్వంసం చేశాయి. పది రోజుల క్రితం ఈ ప్రాంతంలోనే విద్యుత్ షాక్‌తో ఏనుగు మృతి చెందింది. దీంతో ఏనుగులు ఈ ప్రాంతంలోనే తిరుగుతూ పంటలను నాశనం చేస్తున్నాయి. రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన పంటలను ఉద్యాన శాఖ అధికారిణి శివకుమారి, వీఆర్వో మునిరత్నం, సర్పంచ్ శంకర్ రెడ్డి సోమవారం పరిశీలించారు.

స్వర్ణముఖిలో చెత్త వెయ్యొద్దు

తిరుపతి రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం గ్రామ పంచాయతీ పరిధిలోని 250 కాలనీకి సమీపంలో ఉన్న స్వర్ణముఖి నది వద్దకు చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చిన ఓ ఆటోను సోమవారం స్థానికులు అడ్డుకున్నారు. అవిలాల, గాంధీపురం పంచాయతీల నుంచి కొందరు చెత్త, వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ పడేస్తున్నారని, దీనివల్ల వర్షాకాలంలో రోగాలబారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఐదోరోజు సోమవారం వాహన సేవల ముందు కళాకారుల నృత్య ప్రదర్శనలు

అమోఘం... కళా విన్యాసం

- పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

తిరుచానూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పద్మావతీదేవి కార్తీక బ్రహ్మోత్సవాల్లో కళాబృందాల ప్రదర్శన భక్తులకు నేత్రానందం కలిగిస్తోంది. సంప్రదాయ వాద్య పరికరాలతో కళాకారులు ఉదయం, రాత్రివేళల్లో అమ్మవారి వాహనసేవల ముందు ప్రదర్శన ఇస్తున్నారు. సోమవారం ఉదయం పద్మావతి అమ్మవారి పల్లకీసేవలో చండమేళం, లెస్యూమ్స్ నృత్యం, కోలాటాల ప్రదర్శనలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కర్ణాటక ఉడిపిలోని పాలిమర్‌మఠంకు చెందిన బెల్‌కలై చండీమేళం బృందం డ్రమ్స్ వాయిద్యంతో కళాకారులు లయ విన్యాసం ప్రదర్శిస్తున్నారు. మైసూరుకు చెందిన 33 మంది యువతులు లెస్యూమ్స్ నృత్యం, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ఆధ్వర్యంలో మోహినీ అవతారం నృత్యరూపకం, భరతనాట్యం, కూచిపూడి, కోలాటాల ప్రదర్శన ఆకట్టుకుంది. హైదరాబాదుకు చెందిన 25 మంది యువతుల బృందదంచే కొమ్ము-కోయ, గోండు డ్యాన్స్‌లతో నయనానందకరంగా సాగింది. కర్ణాటకకు చెందిన 17 మంది యువతులు ఒడిస్సీ నృత్యం, రాజమండ్రికి చెందిన 30 మంది యువతుల సాంప్రదాయ జానపద నృత్యం, పలమనేరుకు చెందిన 15 మంది కళాకారుల కీలుగుర్రాలు, అనంతపురం శ్రీకృష్ణనాట్య మండలికి చెందిన 30 మంది యవతుల గోపికృష్ణ నృత్యాలు భక్తులను పరవశింపచేశాయి.

అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి జరిగిన గజవాహన సేవకు అశేష భక్తజనం విచ్చేశారు. సాయంత్రం 6 గంటలకు మాడవీధులు నిండిపోయాయి. వేల సంఖ్యలో భక్తులు అమ్మవారికి కర్పూర నారికేళాలు సమర్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తొక్కిసలాటలు జరగకుండా జేఈవో వీరబ్రహ్మం దగ్గరుండి హారతులు ఇచ్చే భక్తులను క్రమపద్ధతిలో పంపించారు. రాత్రి 10 గంటలకు వాహనం సూర్యనారాయణస్వామి ఆలయం వద్దకు చేరుకుంది. వేలాది మంది రావడంతో తిరుచానూరు జనసంద్రంగా మారింది. కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో శ్యామలరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి, జేఈవో వీరబ్రహ్మం, ఎమ్మెల్యే పులివర్తి నాని, బోర్డు మెంబర్ యెల్లా సుచిత్ర, డిప్యూటీ ఈవో గోవిందరాజన్ పాల్గొన్నారు.

అమ్మవారికి కానుకగా ఏడు గొడుగులు



అమ్మవారి ఆలయం వద్ద టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడుకు గొడుగులు అందజేస్తున్న తమిళనాడు దాతలు

తిరుచానూరు పద్మావతి అమ్మవారికి సోమవారం ఏడు గొడుగులు కానుకగా అందాయి. తమిళనాడులోని తిరునిన్రవూరుకు చెందిన శ్రీమద్ రామానుజ కైంకర్య ట్రస్టు ప్రతినిధులు రెండు గొడుగులను టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడుకు అందించారు. బ్రహ్మోత్సవాల్లో గజవాహనం రోజున ఈ ట్రస్టు తరఫున గొడుగులు సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. అలాగే చెన్నైకి చెందిన హిందూ ధర్మార్థ సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆర్‌ఆర్.గోపాల్‌జి ఆధ్వర్యంలో ఐదు గొడుగులను ఆలయ డిప్యూటీ ఈవో గోవిందరాజన్‌కు అందించారు.

కిక్కిరిసిన మాడవీధులు



ఎమ్మెల్యే నాని పట్టువస్త్రాల సమర్పణ



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే నాని, కుటుంబ సభ్యులు

పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం రాత్రి అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయం వద్ద టీటీడీ అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. పట్టువస్త్రాలను నాని సమర్పించారు. దర్శనానంతరం ఆలయ వేదపండితులు వారిని ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. నాని సతీమణి సుధారెడ్డి, కుమారుడు వినీల్ దంపతులు పాల్గొన్నారు.

చెవిరెడ్డి పట్టువస్త్రాల సమర్పణ



పట్టువస్త్రాలు అందజేస్తున్న చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఉదయం చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. తుమ్మలగుంట కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం నుంచి పాదయాత్రగా తిరుచానూరు అమ్మవారి ఆలయం వద్దకు ఉదయం 9 గంటలకు చేరుకున్నారు. ఆలయాధికారులకు చెవిరెడ్డి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సంగీత కచేరీలో కళాకారులు

ఈసారి గజవాహన సేవకు 9,600 మంది భక్తులు హారతులు సమర్పించారు. గతేడాది 8000మంది సమర్పించారు. గతంలో జరిగిన పొరబాట్లను గుర్తించి జేఈవో వీరబ్రహ్మం అమ్మవారి గజవాహనానికి మంగళ హారతులు సమర్పించే భక్తులను బారికేడ్ల బయటకు రప్పించే విధంగా ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు.

వచ్చెను అలవేలుమంగ..!



కళాకారుల నృత్య ప్రదర్శన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): వచ్చెను అలవేలు మంగ.. పచ్చల కడియాల పణతి చెలంగ.. అంటూ సాగిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆద్యంతమూ ఆకట్టుకున్నాయి. పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా తిరుపతిలోని వివిధ కళా వేదికలపై సోమవారం పలు సాంస్కృతిక ప్రదర్శనలు సాగాయి. తిరుచానూరు ఆస్థాన మండపంలో ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు మంగళధ్వని, ఎస్వీ వేద అధ్యయన సంస్థకు చెందిన పండితులతో చతుర్వేద పారాయణం నిర్వహించారు. తిరుపతికి చెందిన డాక్టర్ రాఘవాచార్యులు 'శ్రీ సూక్త వ్యాఖ్యానం' అంశంపై ప్రసంగించారు. బెంగళూరుకు చెందిన రంగనాథ్ బృందం భక్తి సంగీత కార్యక్రమాన్ని చేపట్టారు. తిరుపతికి చెందిన సావిత్రి, జయంతి బృందం హరికథ పారాయణం చేశారు. రఘునాథ్ బృందం అన్నమయ్య సంకీర్తనలను గానం చేశారు. మహతి కళా క్షేత్రంలో ఢిల్లీకి చెందిన పద్మశ్రీ కనకా శ్రీనివాసన్ భరతనాట్య ప్రదర్శన, అన్నమాచార్య కళా మందిరంలో విజయవాడకు చెందిన హర్షిత, రాధారాణి బృందం భక్తి, సంగీత కార్యక్రమం నిర్వహించారు. రామచంద్ర పుష్కరిణి వద్ద తిరుపతికి చెందిన డాక్టర్ జె.లలిత, హోసూరుకు చెందిన శ్రీకృష్ణ బృందం భక్తి సంగీతం నిర్వహించారు. శిల్పారామంలో వైష్ణవి బృందం నృత్య రూపకం అలరించింది.

తిరుమల నుంచి లక్ష్మీకాసుల హారం రాక



తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి జరిగిన గజవాహనసేవకు శ్రీవారి లక్ష్మీకాసుల హారాన్ని తీసుకొచ్చారు. తిరుమల శ్రీవారిపాదాల చెంత ప్రత్యేక పూజలు నిర్వహించాక లక్ష్మీకాసుల హారాన్ని మాడవీధుల్లో ఊరేగించి తిరుచానూరుకు తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కపిలతీర్థం వద్దకు అనుమతి లేదు





కపిలతీర్థం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కపిలతీర్థంలో జలపాతం ఉధృతంగా ప్రవహించింది. దీంతో భక్తులను పుష్కరిణి.. జలపాతం వైపు రానీయలేదు. సోమవారం సాయంత్రం దీపాలు పెట్టేందుకూ భక్తులను అనుమతించలేదు. దీంతో ఆలయ ఆవరణలోని చెట్టు వద్ద భక్తులు దీపాలు వెలిగించారు.

జడివానతో అస్తవ్యస్తం

రామచంద్రాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాలుగు రోజులుగా వర్షం కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. కూలీలు, చిరువ్యాపారులు పనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆదివారం రాత్రి వర్షంతో కూడిన హోరుగాలి వీచడంతో రాయలచెరువుకట్టపై చెట్టుకొమ్మలు, అంజనేయస్వామి ఆలయం వద్ద విద్యుత్ స్తంభం విరిగిపడ్డాయి. బొప్పరాజుపల్లి వద్ద అరటి తోట, గంగిరెడ్డిపల్లి వద్ద కోతకు వచ్చిన వరిపైరు నీటిలో నానిపోయింది. గణేశ్వరపురానికి చెందిన మురళీనాయుడు సొరకాయ తోట నీటి మునిగి కుళ్లిపోయింది. అనుపల్లి అడవుల నుంచి సుద్దేటి వంక ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాయలచెరువులోకి వరదనీరు చేరి క్రమేపీ నీటిమట్టం పెరుగుతోంది.





ఆంజనేయస్వామి గుడి వద్ద విరిగిపడిన విద్యుత్ స్తంభం, గణేశ్వరపురం వద్ద నీట మునిగిన సొరకాయల తోట

'వీ రన్ ఫర్ తిరుపతి' పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : శ్రీనివాస క్రీడా సముదాయం నుంచి ఈ నెల 8వ తేదీన నిర్వహించనున్న 'వీ రన్ ఫర్ తిరుపతి' కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శాప్ ఛైర్మన్ ఎ.రవినాయుడు సోమవారం ఆవిష్కరించారు. 10కేఎం, 5కేఎం, 3కేఎం విభాగాలలో పోటీలు నిర్వహించనున్నామని తెలిపారు. 10 కిలోమీటర్ల రన్ విజేతలకు రూ.60వేలు నగదు బహుమతి ప్రదానం చేయనున్నట్లు చెప్పారు. పాల్గొనే వారందరికీ టీషర్ట్, మెడల్, సర్టిఫికెట్ అందజేస్తామని నిర్వాహకురాలు రాఘవేనా తెలిపారు.



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న శాప్ ఛైర్మన్

మంచి పిల్లలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి

తిరుపతి(విద్య), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మంచి పిల్లలు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటిస్తారని తిరుపతి ట్రాఫిక్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి చెప్పారు. జీఎస్ మాడ వీధిలోని శ్రీచైతన్య పాఠశాలలో సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సైకిళ్లలో పాఠశాలలకు వచ్చేటప్పుడు అతివేగం మంచిది కాదన్నారు. రోడ్డుకు ఎడమవైపునే వెళ్లాలని, కుడివైపునకు మలుపు తిరగాలన్నప్పుడు తప్పనిసరిగా హ్యాండ్ సిగ్నల్ చూపించాలని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాలల డీన్ సురేష్, ప్రిన్సిపాల్ జయప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ కిషోర్‌బాబు, కో-ఆర్డినేటర్ బాలాజీ, సీఅండ్ఎం బ్యాచ్ ఇన్‌చార్జి నరేంద్రబాబు, ప్రైమరీ ఇన్‌చార్జి అర్చన పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా తిరుపతి విద్యుత్ టౌన్ డివిజన్ పరిధిలో సరఫరాలో జరిగిన అంతరాయాలను పునరుద్ధరించే పనులు చేపడుతున్నామని ఈఈ వి.చంద్రశేఖరరావు తెలిపారు. ఈదురుగాలులకు సుమారు రూ.8లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని చెప్పారు. డివిజన్ పరిధిలోని బీటీఆర్ కాలనీ, మంగళం, చైతన్యపురం, శ్రీనివాసపురం, కరకంబాడీ, మామండూరు, పాత రేణిగుంట, కృష్ణాపురం, గాజుల మండ్యం, పారిశ్రామికవాడ ప్రాంతాలను సోమవారం ఆయన పరిశీలించారు. రైతులు, వినియోగదారులను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. డివిజన్‌లో 20 విద్యుత్ నియంత్రికలు (ట్రాన్స్‌ఫార్మర్లు), 500 మీటర్ల విద్యుత్ తీగలు పాడైనట్లు తెలిపారు. డీఈఈ రమేష్, ఏఈలు పాల్గొన్నారు.


వినియోగదారులతో మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డైరెక్టర్ ఆర్వీకుమార్

తిరుపతి(వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని కాలుష్య నియంత్రణ చర్యలతో పాటు పర్యావరణ పరిరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ అన్నారు. కమ్యూనిటీ మెడిసిన్ ఆధ్వర్యంలో సోమవారం స్విమ్స్‌లో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కుమార్ మాట్లాడుతూ భోపాల్ గ్యాస్ విపత్తులో ప్రాణాలు కోల్పోయిన వారి జ్ఞాపకార్థం ఏటా కాలుష్య నివారణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. అనంతరం చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు ఉషా కళావత్, మాధవి, ఎంఎస్ రామ్, ఆర్ఎంవో కోటిరెడ్డి, వైద్య విభాగాధిపతులు నాగరాజు, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థుల ప్రతిభ


క్రీడాకారులను అభినందిస్తున్న డీన్ డాక్టర్ ఎంవీ రమణ

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ అంతర కళాశాలల క్రీడా, సాంస్కృతిక పోటీల్లో ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు పలు విభాగాల్లో ప్రతిభ కనబరిచారు. బాపట్ల, నైరా, తిరుపతి మైదానాల్లో మూడు విడతలలో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించారు. తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు బాస్కెట్‌బాల్, టేబుల్‌టెన్నిస్, ఫుట్‌బాల్‌లలో విజేతలుగా నిలిచారు. వందమీటర్ల పరుగుపందెంలో రెండో స్థానం, 200 మీటర్లు, 400 మీటర్లలో మూడోస్థానంతో సరిపెట్టుకున్నారు. మహిళా విభాగం చదరంగంలో రన్నరప్‌గా, లాంగ్‌జంప్‌లో రెండో స్థానం, హైజంప్‌లో మూడో స్థానం దక్కించుకున్నారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను శ్రీవేంకటేశ్వర వ్యవసాయ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకున్నారు. సోమవారం కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.వి.రమణ క్రీడాకారులను అభినందించారు.

హోరాహోరీగా అంతర్ కళాశాలల అధ్యాపక క్రీడా పోటీలు


షీల్డ్ అందుకుంటున్న టేబుల్ టెన్నిస్ డబుల్స్ విజేతలు


ట్రోఫీ అందుకుంటున్న బాల్ బ్యాడ్మింటన్ విజేతలు

తిరుపతి(క్రీడలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అంతర్ కళాశాలల అధ్యాపక వార్షిక క్రీడా పోటీలు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఇండోర్ స్టేడియంలో సోమవారం హోరాహోరీగా జరిగాయి. 15కాలేజీల నుంచి మెన్ అండ్ ఉమెన్ టీమ్స్ పోటీలలో ప్రాతినిధ్యం వహించాయి. చదరంగం పోటీల్లో కె.సమిదప్ప(కె డిగ్రీ కళాశాల కుప్పం), బ్యాడ్మింటన్ సింగిల్స్‌లో ఎస్.ముస్తక్‌అహ్మద్(ఎస్వీ ఆర్ట్స్ కళాశాల తిరుపతి) విజయం సాధించారు. బ్యాడ్మింటన్ డబుల్స్‌లో ఆర్.లోకేశ్ అండ్ ఎం.శ్రీకాంత్(పీవీకేఎన్ కళాశాల చిత్తూరు), టేబుల్ టెన్నిస్ సింగిల్స్‌లో ఎం.కిరణ్‌కుమార్‌రాజు(ఎస్వీ ఆర్ట్స్ కళాశాల తిరుపతి), డబుల్స్‌లో ఎం.శివశంకర్‌రెడ్డి, టి.మధుసూదన్‌రెడ్డి(ఎస్వీయూ కాలేజీ తిరుపతి) గెలుపొందారు. బాల్‌బ్యాడ్మింటన్ మెన్ విభాగంలో ఎస్వీయూ కాలేజీ (తిరుపతి)జట్టు, ఉమెన్ విభాగంలో ఎస్వీయూ కాలేజీ (తిరుపతి) జట్టు విజయం సాధించాయి. త్రోబాల్ ఉమెన్ ఎస్వీయూ కాలేజీ(తిరుపతి) జట్టు గెలుపొందింది. గెలుపొందిన జట్లకు, క్రీడాకారులకు ఎస్వీయూ రిజిస్ట్రార్ ఎం.భూపతినాయుడు ట్రోఫీ, సర్టిఫికెట్స్, బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు బీవీ మురళీధర్, ఎం.శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

9న అప్రెంటిస్‌షిప్ మేళా

తిరుపతి(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన తిరుపతి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రైమినిస్టర్ నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 9441647174, 9533717170లలో అప్రెంటిస్‌షిప్ అడ్వైజర్ గంగాధరాన్ని సంప్రదించాలని సూచించారు.

6న జిల్లాకు మంత్రి సుభాష్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ నెల 6న జిల్లా పర్యటనకు రానున్నారు. అనంతపురం నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం వివిధ అంశాలపై కలెక్టరేట్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుగు పయనమవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

కపిలతీర్థం, మాల్వాడిగుండం నీటిని సద్వినియోగం చేయాలి

తిరుపతి (జీవకోన), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : కపిలతీర్థం, మాల్వాడిగుండం మీదుగా ప్రవహించే వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ తిరుమల శ్రీవారి శేషాచలం కొండల నుంచి వర్షాకాలంలో నీరంతా వృథాగా పోతోందన్నారు. బాలాజీ రిజర్వాయర్ నిర్మించి, నీటిని నిల్వ ఉంచితే తిరుపతిలో భూగర్భ జలాలు పెరుగుతాయని పేర్కొన్నారు. దీనిపై టీటీడీ ధర్మకర్తల మండలి చొరవ చూపాలని కోరారు.

మలబార్‌లో బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన

తిరుపతి అర్బన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో బ్రాండెడ్ ఆభరణాల ప్రదర్శన ఏర్పాటు చేశామని షోరూం హెడ్ రిజీష్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అద్వితీయమైన కళానైపుణ్యం, అంతులేని హుందాతనంతో బంగారం, వజ్రాభరణాలు, జాతి రత్నాలు ప్రదర్శించినట్లు తెలిపారు. తరుగు చార్జీల్లో, వజ్రాల విలువపై 25 శాతం తగ్గింపు ఆఫర్లను ప్రకటించినట్లు వివరించారు. ఈనెల 8వతేదీ వరకు మాత్రమే ప్రత్యేక ప్రదర్శన, ఆఫర్ల అవకాశం కల్పించామని, నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

రైల్వేలో ఎన్నికల కోలాహలం

- రేపటి నుంచి మూడు రోజులు ఓటింగ్ ప్రక్రియ
- ముమ్మరంగా నేతల ప్రచారం


తిరుపతి రైల్వేస్టేషన్‌లో ప్రచారం చేస్తున్న మజ్దూర్ యూనియన్ నేత శంకరరావు

తిరుపతి(సెంట్రల్), డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): లక్షలాది మంది ఉద్యోగులు పనిచేస్తున్న రైల్వేలో డిసెంబర్ 4, 5, 6 తేదీల్లో గుర్తింపు సంఘాల ఎన్నికలు జరగనున్నాయి. కోర్టు వివాదాలు దాటుకుని 11 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలకు సంఘాల నేతలు సన్నద్ధమయ్యారు. జోరుగా ప్రచారం చేస్తున్నారు. రైల్వేలో ఉద్యోగ, కార్మిక సంఘాలకు ఐదేళ్లకొకసారి ఎన్నికలు నిర్వహించడం ఆనవాయితీ. 2007 వరకు ఉద్యోగ సంఘాల సభ్యత్వం మీద ప్రభుత్వం గుర్తింపు ఇచ్చేది. అయితే ఎన్నికల్లో 51 శాతం ఓట్లు వస్తేనే గుర్తింపు ఇస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిబంధన పెట్టడంతో దక్షిణ రైల్వే యూనియన్ నాయకులు చెన్నై హైకోర్టును ఆశ్రయించారు. పలు దఫాల చర్చల అనంతరం ఎన్నికల్లో పోలైన ఓట్లలో 35 శాతం వస్తే ఆ సంఘానికి గుర్తింపు లభించే విధంగా అంగీకరించారు. దీంతో ఎన్నికలకు లైన్ క్లియర్ అయింది.

ఇప్పటివరకు రెండుసార్లు మాత్రమే ఎన్నికలు..

రైల్వేలో ఇప్పటివరకు ఉద్యోగ సంఘాల గుర్తింపు కోసం రెండుసార్లు మాత్రమే ఎన్నికలు జరిగాయి. 2007, 2013లో జరిగాయి. 2019లో కరోనా కారణంగా జరగలేదు. తర్వాత ప్రభుత్వం పెట్టిన నిబంధనపై సంఘాల నేతలు కోర్టుకు వెళ్లడంతో జరగలేదు. ఈ విషయంపై పలుమార్లు ఉద్యోగ సంఘాల నాయకులు కేంద్ర ప్రభుత్వంతో చర్చించినా ఫలితం లేకపోయింది. కోర్టు తీర్పు నేపథ్యంలో డిసెంబరు 4, 5, 6, తేదీలలో నిర్వహించాలని నిర్ణయించింది.

జోరుగా ప్రచారం..

11 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికల్లో మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్‌లు పోటీ పడుతున్నాయి. జోనల్, డివిజన్ స్థాయిలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఉద్యోగులను ప్రసన్నం చేసుకునేందుకు యూనియన్ల నేతలు రకరకాల హామీలు గుప్పిస్తున్నారు.

- దేశంలో 16 రైల్వే జోన్లు, ఒక మెట్రో జోన్, ఆరు ప్రొడక్షన్ యూనిట్లు ఉన్నాయి.
- 12,18,221 మంది ఉద్యోగులు ఓటు హక్కు కలిగి ఉన్నారు.
- సౌత్ సెంట్రల్ రైల్వేలో 75,683 మంది, గుంతకల్లు డివిజన్‌లో 14,453 మంది ఉన్నారు.

ఎంఎస్ఎంఈ, ఎన్‌పీసీఐ పోర్టల్‌లో
వివరాలు నమోదు చేసుకోండి

- జియో ట్యాగింగ్‌కు సహకరించండి : కమిషనర్ మౌర్య


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్‌మౌర్య

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో జరుగుతున్న జియో ట్యాగింగ్‌పై ఎవరికీ అపోహలు వద్దని, ఓటీపీని సచివాలయ కార్యదర్శులకు చెప్పి సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో, ఆన్‌లైన్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో కమిషనర్ సమావేశం నిర్వహించారు. జియో ట్యాగింగ్ కోసం వెళ్తే ప్రజలు సహకరించడం లేదని పలువురు కమిషనర్‌కు తెలిపారు. ఆమె మాట్లాడుతూ నగరంలో నివసిస్తున్న వారి వివరాల కోసం సచివాలయం సిబ్బంది కావాల్సిన సమాచారం సేకరిస్తున్నారని, ఇందులో ఎటువంటి మోసాలకూ తావు లేదని అన్నారు. ఇది పూర్తిగా ప్రభుత్వం చేస్తున్న సర్వే అని. అందరూ సహకరించాలని కోరారు. సచివాలయ సిబ్బంది ఇళ్లను సందర్శించి వివరాలు సేకరిస్తారని, ఫొటో తీసి యాప్‌లో నమోదు చేస్తారని అన్నారు. ప్రభుత్వ పథకాలు పొందేందుకు నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్.పి.సి.ఐ) ప్రకారం ప్రతి ఒక్కరికీ ఆధార్ లింక్‌తో బ్యాంక్ అకౌంట్ ఉండాలన్నారు. ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్ జరుగుతున్నాయని, పోర్టల్లో నమోదు చేసుకోవాలని అన్నారు. తద్వారా కేంద్ర పథకాలను పొందవచ్చునని, అలాగే వడ్డీ రాయితీ పథకాలు వస్తాయన్నారు. ప్రభుత్వ టెండర్లకు అర్హులవుతారని అన్నారు. ఇదే విషయాన్ని ప్రజలకు వివరించి, సర్వే చేయాలని ఆదేశించారు.

నగర పాలక సంస్థ పీజీఆర్ఎస్‌కు 25 వినతులు

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో ప్రజల నుంచి 25 వినతులు వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. 25 మంది వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వినతులు అందించారు. టిడ్కో ఇళ్ల వద్ద పారిశుధ్య పనులు చేపట్టాలని, నెహ్రూ మున్సిపల్ గ్రౌండ్‌లో స్టాల్స్ ఏర్పాటు చేయాలని టీడీఆర్ బాండ్లు ఇప్పించాలని, గతంలో ఇళ్ల కోసం నగదు కట్టామని, ఇళ్లు ఇవ్వలేదని డబ్బులు తిరిగి ఇవ్వాలని, శ్రీవారి నగర్‌లో విద్యుత్ దీపాలు వెలగలేదని, నగరంలో కుక్కల బెడద ఎక్కువగా ఉందని పరిష్కరించాలని కోరారని తెలిపారు. కార్యక్రమంలో ఏడీసీ చరణ్‌తేజ్ రెడ్డి, ఎంఈలు తులసి కుమార్, గోమతి, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్, ఆర్వో సేతు మాధవ్, రవి, సెక్రటరీ రాధిక, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడువులోపు అర్జీలను పరిష్కరించాలి

- అధికారులకు జేసీ ఆదేశం
- కలెక్టరేట్లో పీజీఆర్ఎస్ 82 వినతులు


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీనీ గడువులోపు పరిష్కరించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి డీఆర్వో నరసింహులు, ఇతర అధికారులు వినతులు స్వీకరించారు. మొత్తం 82 వినతులు అందగా అందులో 53 భూ సమస్యలపైనే ఉన్నాయి. సూళ్లూరుపేటలో జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కలెక్టర్ వెంకటేశ్వర్ నిర్వహించడంతో చుట్టుపక్కల మండలాల ప్రజలు అక్కడికి వెళ్లారు. వర్షం కారణంగా కలెక్టరేట్‌కు సోమవారం అర్జీదారులు తగ్గారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టాలి



దామినేడులో పెద్ద సంఖ్యలో డ్వాక్రా సంఘాల మహిళలు ఉన్నారని, కమ్యూనిటీ హాలు లేకపోవడంతో సమావేశాలు నిర్వహించుకునేందుకు ఇబ్బందిగా ఉందని అధికారుల దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో తిరుచానూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులు చేపట్టారని, ఎన్నికలు రావడంతో సగంలో ఆగిపోయాయని తెలిపారు. జిల్లా అధికారులు స్పందించి తక్షణం భవన నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి, అధికారులకు వినతిపత్రం అందజేశారు.

జీతాల్లేక ఇబ్బంది పడుతున్నాం..


కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న ప్రభుత్వ పాఠశాలల కార్మికులు

కొన్ని నెలలుగా జీతాలు అందక ఇబ్బంది పడుతున్నామని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలు, కుకింగ్ హెల్పర్స్, వాచ్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ స్కూల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వారు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. సంఘం నాయకురాలు లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పెరిగిన ధరలకనుగుణంగా వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వర్తింపజేయాలన్నారు. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా పాఠశాలల్లో కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఆయేషా, మల్లీశ్వరి, జయమ్మ, కుమారి, అనురాధ పాల్గొన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్‌కు 48..


ప్రజల సమస్యలు వింటున్న ఎస్పీ

తిరుపతి(వైద్యం), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్(ప్రజా సమస్యల పరిష్కార వేదిక)కు 48 వినతులు అందాయి. ఎస్పీ సుబ్బరాయుడు ప్రజల నుంచి వినతులు అందుకున్నారు. పరిష్కరించే దిశగా కృషి చేస్తామని బాధితులకు భరోసా ఇచ్చారు. సంబంధిత స్టేషన్ నుంచి వచ్చిన కొన్ని సమస్యలను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే పరిష్కరించారు. సివిల్ కేసులకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి తగిన సూచనలు చేశారు. ఏఎస్పీ రవిమనోహరాచారి పాల్గొన్నారు.

అటవీ ప్రాంతాల్లో విద్యుత్ సమస్యలపై పరిశీలన


చిన్నగొట్టిగల్లు మండలం ఎగువూరు అటవీ ప్రాంతంలో పరిశీలిస్తున్న విద్యుత్ అధికారులు

తిరుపతి(ఆటోనగర్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ అధికారుల సూచనల మేరకు సోమవారం రూరల్ డివిజన్ పరిధిలోని చిన్నగొట్టిగల్లు, పాకాల, చంద్రగిరి మండలాల్లో ఉన్న అటవీ ప్రాంతాల్లోని పొలాలకు విద్యుత్ సరఫరా అవుతున్న ప్రాంతాలను పరిశీలించామని ఈఈ వాసురెడ్డి సూచనలు చేశారు. వంగిన విద్యుత్ స్తంభాలు, ఎత్తు తక్కువగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేయాలని ఆదేశించామన్నారు. ఏనుగులు సంచరించే సమయంలో ప్రజలు పొలాల వద్దకు వెళ్లరాదన్నారు. గ్రామాల్లో విద్యుత్ తీగలు ఎత్తు తక్కువగా ఉంటే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. డీఈఈ జీవన్ కుమార్, ఏఈ రఫీక్ బాషా పాల్గొన్నారు.

రూ.25 కోట్లతో రేణిగుంట రైల్వేస్టేషన్ అభివృద్ధి

- గూడ్స్ షెడ్ యార్డ్ ఏర్పాటు
- సీఆర్ఎస్-రేణిగుంట రైల్వేస్టేషన్ల మధ్య అదనపు రైలు మార్గం
- అదనంగా రెండు ప్లాట్‌ఫారాలు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రేణిగుంట రైల్వేస్టేషన్ ఆధునికీకరణకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల రూ.25 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో అభివృద్ధి పనులు వేగంగా సాగుతున్నాయి. రేణిగుంట దక్షిణం వైపు సీబీఐడీ కాలనీలోని చెన్నై రైలు మార్గం ఆనుకుని గూడ్స్ యార్డ్ పనులు ప్రారంభమయ్యాయి. ఆ ప్రాంతంలో పాడుపడిన ఉద్యోగుల వసతిగృహాలను పడగొట్టి పనులు ప్రారంభించారు. ఈ పనులు పూర్తయితే గూడ్స్ రైళ్ల వలన ప్యాసింజరు రైళ్లకు ఆలస్యం ఉండదు. అలాగే స్టేషన్ నుంచి సీఆర్ఎస్‌కు అదనపు లైను నిర్మాణ పనులు చేపట్టారు. మట్టి పనులు జరుగుతున్నాయి. ఈ పనులు పూర్తయిన వెంటనే ఇంటర్ లాకింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. వంతెనలు పొడిగించే పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేస్తే రైళ్ల రాకపోకలకు ఇబ్బంది ఉండదు. ప్లాట్‌ఫాం 1 (రోడ్డు నెంబరు ఒకటి) నుంచి విజయవాడ వైపు ఉన్న రైలు మార్గానికి అనుసంధానం (ఇంటర్ లాకింగ్) పనులు చేపట్టాల్సి ఉంది. ఆ పనులు చేపట్టాలంటే రైల్వే బోర్డు స్థాయిలో లైన్ బ్లాక్ తీసుకోవాలి. ఆ సమయంలో ఢిల్లీ, హౌరా వెళ్లే సూపర్ ఫాస్ట్ రైళ్ల దారి మళ్లించాలి. ఈ పనులు పూర్తి చేస్తే రైళ్ల ఆలస్యం, పొలిమేరలో వేచి ఉండాల్సిన దుస్థితి ఉండదు. ఈ జంక్షన్‌లో మరో రెండు ప్లాట్‌ఫారాలు ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. 5వ నెంబరు ప్లాట్‌ఫారానికి తూర్పు వైపు నూతనంగా ఏర్పాటు చేయడానికి నిర్ణయించారు. ఈ మేరకు పనులు చేపట్టాల్సి ఉంది. ఈ పనులు సకాలంలో పూర్తి చేసేలా కృషి చేస్తున్నట్లు తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి తెలిపారు. ఇందుకోసం పలుమార్లు రైల్వే మంత్రులు, అధికారులతో సంప్రదింపులు చేశామని పేర్కొన్నారు.



పెండింగ్‌లో ఉన్న రైలుమార్గం అనుసంధానం పనులు, వినాయకనగర్ సమీపంలో మూడవ రైలు మార్గం పనులు







పల్లకిపై జనని.. పులకించిన అవని

తిరుచానూరు పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు ఐదోరోజు సోమవారం ఆద్యంతం వైభవంగా సాగాయి. కమ్ముకున్న కారుమబ్బులూ.. ఉండి ఉండీ కురుస్తున్న వానజల్లుల నడుమ మాడవీధులు కళాబృందాల ప్రదర్శనలతో హోరెత్తాయి. లక్ష్మీకాసుల హారం ఊరేగింపు, వసంతోత్సవం సోమవారం విశేషంగా సాగాయి.

-తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

మోహినీ రూపి

వాలుజడ వయ్యారం.. అర్థనిమీలిత నేత్రాలు.. చిరుమందహాసం.. పున్నమి జాబిల్లిని మించి న ముఖారవిందంతో పద్మావతి అమ్మ మోహిని అవతారంలో పల్లకిలో ఊరేగారు. సోమవారం ఉదయం ఎనిమిది నుంచి పది గంటల దాకా మాడవీధుల్లో కిక్కిరిసిన భక్తజనసందోహం నడుమ పల్లకిసేవ సాగింది.







గంధము పుయ్యరుగ...

అమ్మవారికి గజవాహనం రోజున వసంతోత్సవం (చందనోత్సవం) వేడుకగా జరిగింది. సోమవారం మధ్యాహ్నం స్నపన తిరుమంజనం అనంతరం పద్మావతమ్మను ఆలయ ప్రదక్షిణగా సన్నిధి మండపానికి తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు స్వర్ణ కమల తిరుచ్చిపై అమ్మవారిని తిరువీధుల్లో ఊరేగిస్తూ అర్చకులు, టీటీడీ అధికారులు చందనం కలిపిన నీటిని భక్తులపై చల్లుతూ.. చిరుజల్లుల నడుమ వసంతోత్సవాన్ని నిర్వహించారు.

నేడు గరుడవాహనం

- ఉదయం 8 గంటలకు : సర్వభూపాల వాహనం
- సాయంత్రం 4.20 : స్వర్ణరథోత్సవం
- రాత్రి 7 : గరుడవాహనం



దేవేరికి శ్రీవారి లక్ష్మీకాసుల హారం

గజవాహనమెక్కి ఊరేగే దేవేరి కోసం సోమవారం తిరుమల శ్రీనివాసుడు తన సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని పంపారు. పున్నమి గరుడసేవలో శ్రీవారికి అలంకరించే ఈ హారాన్ని గజవాహన సేవలో అమ్మవారికి అలంకరించడం ఆనవాయితీ. ఉదయం తిరుమల ఆలయంలో లక్ష్మీకాసుల హారాన్ని శ్రీవారిపాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తిరుమల మాడవీధుల్లో ఊరేగించి టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి తిరుచానూరుకు తీసుకువచ్చారు. తిరుచానూరు పసుపు మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర మాడవీధుల నుంచి అమ్మవారి ఆలయం వరకు వేడుకగా సాగింది. హారాన్ని అమ్మవారి మూలవర్లకు అలంకరించారు. రాత్రి గజవాహనసేవలో అమ్మవారికి సహస్ర లక్ష్మీకాసుల హారాన్ని అలంకరించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్.నాయుడు పాల్గొన్నారు.

ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ పీజీఆర్ఎస్: కలెక్టర్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇకపై నియోజకవర్గ కేంద్రాల్లోనూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ తెలిపారు. సోమవారం సూళ్లూరుపేటలోని సత్యసాయి కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఆర్డీవో ఈ.కిరణ్మయి ఆధ్వర్యంలో నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు వివిధ శాఖ అధికారులు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సూళ్లూరుపేట ప్రజలు తిరుపతి జిల్లా కేంద్రానికి రావడానికి దాదాపు 3 గంటలకు పైగా సమయం పడుతుందన్నారు. పేదలు అంతదూరం రాలేరని, జిల్లా అధికార యంత్రాంగమే ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను పరిష్కరించేలా చొరవ చూపామన్నారు. ఇందులో భాగంగా తొలిసారిగా సూళ్లూరుపేటలో పీజీఆర్ఎస్ నిర్వహించి అర్జీలు స్వీకరించామన్నారు. ఇకపై ప్రతి రెండు వారాలకోసారి జిల్లాలో ఏదో ఒక నియోజకవర్గాన్ని ఎంచుకొని పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. కాగా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 164 అర్జీలు వచ్చాయి. ఇందులో రెవెన్యూ డ్రైనేజీ, తాగునీరు సమస్యలను ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహరావు, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎంపీడీవో ప్రమీలా రాణి, గృహనిర్మాణ శాఖ ఏఈ సత్యనారాయణ, పీఆర్ డీఈ రమణయ్య ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చంద్రశేఖర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్థానికుల్లో ఆనందం

- నేటి శ్రీవారి దర్శనానికి టోకెన్ల జారీ

తిరుపతి/తిరుమల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్థానికులకు శ్రీవారి ఉచిత దర్శన టోకెన్లను సోమవారం జారీ చేయడంతో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. స్థానికులకు తొలిసారిగా 2013లో నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీవారి దర్శనం కల్పించాలని నిర్ణయించింది. ఆ తర్వాత 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక ప్రతినెలా మొదటి మంగళవారం 5వేల టోకెన్లు చొప్పున ఇస్తూ వచ్చారు. 2019లో జగన్ సీఎం కాగానే స్థానికుల దర్శనానికి మంగళం పాడారు. గతంలో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి టీటీడీ ఛైర్మన్ అయినా స్థానికుల దర్శనం పట్టించుకోలేదు. గత ఎన్నికల్లో కూటమితరఫున పోటీచేసిన ఆరణి శ్రీనివాసులు ఎన్నికల హామీగా స్థానికులకు శ్రీవారి దర్శనం అంశాన్ని తీసుకొచ్చారు. ఈక్రమంలో నూతన ధర్మకర్తల మండలి ఏర్పాటయ్యాక.. తొలి సమావేశంలోనే స్థానికుల దర్శనాన్ని పునరుద్ధరించింది. గతంలో తిరుమల, తిరుపతి వారికే ఉండగా.. ఇప్పుడు చంద్రగిరి, రేణిగుంట మండలాలనూ కలిపారు. మంగళవారం నాటి దర్శనానికి సోమవారం ఉదయం తిరుపతిలోని మహతిలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి, చంద్రగిరి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, పులివర్తి నాని, టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్యచౌదరి కలిసి కొంతమంది స్థానికులకు స్వయంగా టోకెన్లు జారీ చేశారు. వేకువజాము 4నుంచి ఉదయం 11.30 గంటలకే 2500 టోకెన్లు పూర్తయ్యాయి. తిరుమలలోని బాలాజీనగర్ కమ్యూనిటీ హాలులో ఉదయం 7.30 గంటలకు టోకెన్ల జారీని ప్రారంభించారు. ఈ టోకెన్లు పొందిన వారికి.. తిరిగి మూడు నెలల తర్వాతే అవకాశం ఉంటుంది. దీంతో వైకుంఠ ద్వార దర్శనానికి టోకెన్లు రావనే భయంతో కొందరు వెనకడుగు వేశారు. దీంతో తిరుమలలో 500 టోకెన్లు స్థానికుల కోసం కేటాయించినా.. 403 మాత్రమే తీసుకోగా 97 మిగిలిపోయాయి. ఈ టోకెన్లు తీసుకున్న వారు మంగళవారం ఉదయం ఒరిజినల్ ఆధార్ కార్డులతో.. ఆయా టైం స్లాట్ల ప్రకారం దివ్యదర్శనం క్యూలో వెళ్లి శ్రీవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది.



తిరుమలలో టోకెన్లు పొందిన స్థానికులు



తిరుపతిలో టోకెన్ల కోసం క్యూలో వెళుతున్న స్థానికులు

ఇదో గొప్ప అవకాశం

తిరుమల, తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట స్థానికులకు ఇదో గొప్ప అవకాశమని టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తొలిబోర్డులోనే తీసుకున్న నిర్ణయాన్ని ఎంతో కష్టపడి ఇంత త్వరగా అమలు చేసిన అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. ఇకపై ప్రతి నెలా మొదటి మంగళవారం దర్శనానికి ఆదివారం టోకెన్లు జారీ చేయనున్నట్లు ఈవో శ్యామలరావు చెప్పారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా స్థానికుల దర్శనానికి ప్రణాళికలు రూపొందించుకున్నామని అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. వైకుంఠ ఏకాదశి టోకెన్లకు, స్థానికుల దర్శన టోకెన్లకు సంబంధించి త్వరలోనే స్పష్టత ఇస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్నామని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానికుల కోటాలో తిరుపతి రూరల్, చంద్రగిరి మండలాలకు అవకాశం ఇవ్వడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే పులివర్తి నాని అన్నారు. సాధారణ దర్శనాలే కాకుండా ఆర్జిత సేవల్లోనూ ప్రత్యేక కోటా ఇవ్వాలని కేంద్రమాజీ మంత్రి చింతా మోహన్ కోరారు. గతంలో ఉన్న 5వేల టోకెన్లు మూడు వేలకు కుదించడం సరికాదన్నారు. గత ఐదేళ్లలో తిరుమల శ్రీవారికి, స్థానికులకు ఉన్న అనుబంధాన్ని విడగొట్టిన వైసీపీ తగిన మూల్యం చెల్లించుకుందని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నేతలు నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, వరప్రసాద్, రాజా రెడ్డి, ఆర్కాట్ కృష్ణప్రసాద్, ఆముదాల వెంకటేష్, కూరపాటి సురేష్, మునస్వామి, యాదవకృష్ణ పాల్గొన్నారు.





ప్రొఫెసర్ చెంగయ్య కారుపై దాడి చేసిన దృశ్యం - ఉద్యోగులు, విద్యార్థుల వాట్సప్ గ్రూపులో అన్యమత ప్రచారం

ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీలో 'అన్యమత' కలకలం

- ప్రచారం చేస్తున్నారంటూ ఓ ప్రొఫెసర్‌పై భజరంగదళ్, ఏబీవీపీ ఆరోపణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం అన్యమత ప్రచారంపై కలకలం రేగింది. ఈఈఈ విభాగ ప్రొఫెసర్ సీహెచ్ చెంగయ్య మత ప్రచారం చేస్తున్నారంటూ భజరంగ్‌దళ్, ఏబీవీపీ ఆరోపించాయి. యూనివర్సిటీ, కాలేజీ జారీ చేసే సర్క్యులర్‌పైన 'ప్రైజ్ ద లార్డ్' అని రాయడాన్ని వారు తప్పుపట్టారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో భజరంగ్‌దళ్ నాయకులు విష్ణు ప్రతీక్ రెడ్డి, కిరీటి, ఏబీవీపీ నాయకులు పూజారి రామచంద్ర, సురేంద్ర తదితరులు ఇంజినీరింగ్ కాలేజీ వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ప్రొఫెసర్ చెంగయ్య చాంబరులోకి వెళ్లి వర్సిటీలో మత ప్రచారం ఎలా చేస్తారంటూ నిలదీశారు. ఆయన్ను చొక్కా పట్టుకొని బయటకు తీసుకొచ్చిన వారు.. ఇటుకలతో కారుపై దాడి చేశారు. అనంతరం వారు ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడికి ఫిర్యాదు చేశారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కాగా, హెడ్ రూములో కుర్చీ వెనుక గల వేంకటేశ్వర స్వామి పటాన్ని తొలగించారని, స్టూడెంట్స్, ఎంప్లాయీస్ ఉన్న వాట్సప్ గ్రూప్‌లలో ఏసు స్తోత్రాలు, వీడియోలు పంపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై ఫిర్యాదులు వచ్చాయి.

మహిళా ప్రొఫెసర్ ఫిర్యాదుతో కమిటీ

కాగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని, మత వివక్ష చూపుతున్నారని ప్రొఫెసర్ చెంగయ్యపై మహిళా ప్రొఫెసర్ ఉషారెడ్డి వీసీ, రిజిస్ట్రార్‌కు మౌఖిక ఫిర్యాదు చేశారు. కాలేజీ ప్రిన్సిపాల్ ద్వారా ఫిర్యాదు వస్తేనే తాము పరిశీలిస్తామని వారు చెప్పినట్టు తెలిసింది. దీంతో ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాసులుకు ఆమె ఫిర్యాదు చేశారు. వృత్తిపరమైన వేధింపులకు గురి చేస్తున్నారనీ, రాత్రి దాకా తమను విభాగంలోనే ఉండేలా చేసేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీంతో వైస్ ప్రిన్సిపాల్ సుబ్బారావు నేతృత్వంలో ఐదుగురు మహిళా ప్రొఫెసర్లతో ఆయన విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. లేడీ ఫ్యాకల్టీతో పాటు ఈఈఈ విభాగానికి చెందిన విద్యార్థులు, ఉద్యోగులందరిని ఈ కమిటీ విచారిస్తుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు తెలిపారు. కాలేజీ కౌన్సిల్‌లోనూ దీనిపై చర్చించామని, విచారణలో భాగంగా ప్రొఫెసర్ చెంగయ్యను పిలిచి మాట్లాడినట్లు చెప్పారు. ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు.

14 మంది ఎర్రస్మగ్లర్ల అరెస్ట్

రెండు వాహనాలు, రంపాలు, గొడ్డళ్ల స్వాధీనం

మంగళం/ఏర్పేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు అటవీ ప్రాంతంలోకి చొరబడుతున్న 14 మంది స్మగ్లర్లను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రెండు వాహనాలు, గొడ్డళ్లు, రంపాలను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ లింగాధర్ బృందం ఆదివారం రాత్రి కృష్ణాపురం ఫారెస్ట్ సెక్షన్‌లో ఎంట్రీ ఎగ్జిట్ పాయింట్లలో తనిఖీలు నిర్వహించారు. చింతపాలెం సమీపంలోని నిషేధిత అటవీ ప్రాంతంలో ఒక ఇన్నోవా, బొలేరో గూడ్స్ వాహనాల్లో కొంతమంది అనుమానాస్పదంగా దిగుతూ కనిపించారు. టాస్క్‌ఫోర్స్ సిబ్బంది చుట్టుముట్టి 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని తనిఖీ చేయగా పిడిలేని ఇనుప బరిసెలు, గొడ్డళ్లు, రంపపు చుట్ట వంట సామగ్రి దొరికాయి. పట్టుబడ్డ వారిలో 13 మంది తమిళనాడుకు చెందిన వారు కాగా ఒకరు చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పట్టుపడ్డ స్మగ్లర్లను, వాహనాలను, గొడ్డళ్లు, రంపాలను తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించి, సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



స్మగ్లర్ల అరెస్ట్ చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

చెవిరెడ్డి చేసింది తప్పుకాదా?

దీనిపై ప్రతిఒక్కరూ ఆలోచించండి ● బాలిక తండ్రి గొంతు నొక్కేసినా సాక్ష్యాలు ఉన్నాయన్న ఎమ్మెల్యే నాని

తిరుపతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): 'చెవిరెడ్డి భాస్కర్ రెడ్డిని నమ్మి వైసీపీ నేతలు పదేపదే మోసపోతుంటారు. ఎర్రావారిపాలేనికి చెందిన బాలిక తండ్రిని నేనెప్పుడూ విమర్శించను. గతంలో ఆయన ఏమి మాట్లాడారో, ఇప్పుడు ఏమి మాట్లాడుతున్నాడో ప్రజలందరికీ తెలుసు. చెవిరెడ్డి చేసింది తప్పు కాదా? అని మాత్రమే ఆలోచించండి. మనకి కూడా ఆడబిడ్డలు ఉన్నారు. మీవిజ్ఞతకే వదిలేస్తున్నా' అని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని వ్యాఖ్యానించారు. ఎర్రావారిపాళెం మండలం యల్లమంద ఘటనపై బాలిక తండ్రితో కలిసి వైసీపీ నేతలు భూమన కరుణాకరరెడ్డి, నారాయణస్వామి ఆదివారం మీడియాతో మాట్లాడిన వ్యవహారంపై సోమవారం నాని స్పందించారు. యల్లమంద ఘటన సమయంలో రమణతో కలసి ఆయన కోడలు మాట్లాడిన వీడియోలను మీడియాకు చూపించారు. ఫిర్యాదుదారుల గొంతు నొక్కేస్తే సుమోటాగా కూడా తీసుకునే అవకాశం పోక్సో కేసులకు ఉందన్న విషయం వైసీపీ నేతలు గుర్తుపెట్టుకోవాలన్నారు. గత ఐదేళ్లుగా చెవిరెడ్డిపై పోరాటం చేస్తున్నానని, భూమనకు శిష్యుడనని చెప్పుకునే చెవిరెడ్డి ఆయన పట్ల ఎలా నడుచుకుంటున్నారో కూడా అందరికీ తెలుసన్నారు. పోలీసులు కక్షసాధింపుగా కేసులు పెడుతున్నారని చెప్పడం సరికాదన్నారు. ఇంకా వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు నియోజకవర్గంలో అనవసరంగా 37 మంది టీడీపీ నాయకులపై చెవిరెడ్డి కేసులు పెట్టించారని గుర్తుచేశారు. ఆడబిడ్డకు అన్యాయం జరిగిందా? లేదా? అని మాత్రమే ఆలోచించాలన్నారు. సాక్ష్యాలు అనేవి ఇచ్చితంగా ఉంటాయని, న్యాయవ్యవస్థ ఎవరికి అన్యాయం జరిగిందో వారిని కాపాడితీరుతుందన్నారు. గత ఐదేళ్లలో తిరుపతి రూరల్లో అభివృద్ధి ఆగిపోయిందని, ఇప్పుడు వేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ప్రజలు గుండెలపై చేయి వేసుకుని ప్రశాంతంగా నిద్రపోతున్నారన్నారు.

నాణ్యమైన మద్యం కాదు.. విద్యనందించాలి

- సీపీఎం జిల్లా సభల ముగింపు కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు రమాదేవి



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

సత్యవేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రజలు కావాల్సింది నాణ్యమైన మద్యం కాదని.. నాణ్యమైన విద్య అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు డి.రమాదేవి అన్నారు. సత్యవేడులో సోమవారం జరిగిన సీపీఎం 14వ జిల్లా సభల ముగింపు సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని స్మార్ట్‌సిటీగా చేస్తామన్న పాలకులు వెంకన్న చెంత మద్యపుటేర్లు పారిస్తున్నారని ధ్వజమెత్తారు. వెంకటగిరి, శ్రీకాళహస్తి, చంద్రగిరి నియోజకవర్గాలకు తాగు, సాగు నీరు అందించడమే లక్ష్యంగా ప్రారంభమైన సోమశిల- స్వర్ణముఖి లింకు కెనాల్ పనులు పూర్తి చేయాలన్నారు. అదానీ సోలార్ కుంభకోణంపై దేశవ్యాప్తంగా చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరిట రాష్ట్ర ప్రజల నుంచి పన్నులు వసూలు చేసి అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేలా కూటమి సర్కారు పనితీరు ఉందని మండిపడ్డారు. జిల్లా సమగ్రాభివృద్ధికి 28 అంశాలతో కూడిన తీర్మానాలను సభలో ఆమోదించారు. నాయకులు రమేష్, గంధం మణి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జిల్లా కార్యదర్శిగా నాగరాజు



జిల్లా సీపీఎం కార్యదర్శిగా వందవాసి నాగరాజు ఎన్నికయ్యారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులుగా కందారపు మురళి, అంగేరి పుల్లయ్య, టి.సుబ్రమణ్యం, దాసరి జనార్దన్, సభ్యులుగా భగత్, సాయి లక్ష్మి, జయచంద్ర, మాధవ్, ఆర్.వెంకటేష్, హరినాథ్, వేణుగోపాల్, బి.రవి, ఆర్.లక్ష్మి, జోగి రవికుమార్ ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలకులుగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి, మూలం రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు భాస్కరయ్య వ్యవహరించారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల, డిసెంబరు2 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. 16 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. 2 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించింది. రూ.3.33 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది.

పుత్తూరు వార్తలు

ఎమ్మెల్యే చొరవతో నిండిన తట్నేరి చెరువు

● సంతోషంలో రైతాంగం


తట్నేరి చెరువు వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

వడమాలపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా నిండని తట్నేరి చెరువు ఎమ్మెల్యే భానుప్రకాష్ చొరవతో నిండి కలుజు పారింది. మండలంలోని పాదిరేడు సమీపంలో భూములను వైసీపీ ప్రభుత్వం టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు కేటాయించింది. దీంతో సమీప అడవుల నుంచి తట్నేరి చెరువుకు నీళ్లు వచ్చే వరవ కాలవను పూడ్చి చేశారు. ఇటీవల చెరువుపై ఆధారపడిన రైతులు వరవ కాలువను తవ్వించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఆయన జలవనరుల శాఖ అధికారులకు సమస్య పరిష్కరించాలని చెప్పారు. దీంతో సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల మేర పూడ్చి వేసిన వరవ కాలువను తవ్వించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఒరవ కాలువ ద్వారా తట్నేరి చెరువుకు నీరు చేరి కలుజు పారుతోంది. సుమారు 50 ఎకరాల విస్తీర్ణం ఉన్న తట్నేరి చెరువు ఆయకట్టు కింద సుమారు 130 ఎకరాల భూములున్నాయి. ఎమ్మెల్యే స్పందనతో చెరువు నిండడంతో ఆయకట్టు రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం చెరువు వద్ద జల హారతి ఇచ్చారు.


వరవ కాలువ ద్వారా చెరవుకు చేరుతున్న నీరు

పిడతల కోన తూముల లీకేజీకి మరమ్మతులు


ఇసుక బస్తాలు దించుతున్న సిబ్బంది, టీడీపీ నాయకులు

వడమాలపేట, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని బంగారెడ్డి కండ్రిగ సమీపంలోని పిడతల కోన తూముల వద్ద లీకేజీ నివారణ కోసం ముందస్తుగా చర్యలు చేపట్టారు. కొన్నేళ్లుగా తూములు మరమ్మతులకు గురైనా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు తూముల వద్ద లీకేజీ అవుతోంది. సమాచారం అందుకున్న జలవనరుల శాఖ ఏఈ మురళీమోహన్ సిబ్బందితో చేరుకుని లీకేజీలకు అడ్డుకట్ట వేశారు. ఎంపీడీవో శేషగిరి రావు, పంచాయితీ కార్యదర్శి దిలీప్, టీడీపీ నాయకులు సోమశేఖర్ రెడ్డి, షణ్ముగం, భారత్ తదితరులు పాల్గొన్నారు.

నిండిన మరో మూడు చెరువులు

పుత్తూరు, డిశంబరు 2(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలో మరో మూడు చెరువులు నిండి కలుజులు పారుతున్నాయి. నిన్నటి వరకు 34 చెరువుల్లో ఐదు నిండగా నేడు గొల్లపల్లి, కట్టకింద రామకృష్ణాపురం, నెత్తం చెరువులు కూడా నిండాయని, మిగిలిన చెరువులకు నీరు చేరుతోందని ఇరిగేషన్ ఏఈ పరశురామ్‌నాయక్ తెలిపారు. గొల్లపల్లి చెరువు తూము కాస్త లీకేజి రావడంతో పూడ్చుతున్నామన్నారు. సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7 మి.మి వర్షం నమోదైందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

వైభవంగా సహస్ర కార్తీక దీపోత్సవం



పుత్తూరు టౌన్, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో కొలువై ఉన్న కామాక్షి దేవి సమేత సదాశివాలయంలో సోమవారం సహస్ర కార్తీక దీపోత్సవం వైభవంగా నిర్వహించారు. తమిళ కార్తీక సోమవారం సందర్భంగా ఉదయం కామాక్షి సమేత సదాశివేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శివపార్వతుల ఉత్సవమూర్తులు కామధేనువుపై విహరించారు. ఇక ఆలయం ఆవరణలో మహిళలు నేతి, పిండి దీపాలతో సహస్ర కార్తీక దీపాలను వెలగించారు.



ఎంపీడీవో అవినీతిపై విచారణ జరిపించండి: సీపీఐ

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి ఎంపీడీవో రఫీఖాన్‌పై వెల్లువెత్తుతున్న అవినీతి ఆరోపణలపై విచారణ జరిపించాలని సీపీఐ శ్రీకాళహస్తి ఏరియా కార్యదర్శి జె.గురవయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎంపీడీవో రఫీఖాన్ గత వైసీపీ ప్రభుత్వ హయాంనుంచి ఇక్కడే కొనసాగుతున్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ పథక ఫీల్డ్ అసిస్టెంట్లకు పెండింగ్‌లోని మూడు నెలల వేతనాలు మంజూరు చేయించి, ఒక్కొక్కరి నుంచి రూ.5వేలు వసూలు చేశారని పేర్కొన్నారు. కొందరు ఫీల్డ్ అసిస్టెంట్ల చేత వారి సహచరులకు బలవంతంగా ఫోన్ చేసి నగదు వసూలు చేసిన వీడియోలు గతంలో వైరల్ అయ్యాయని గుర్తు చేశారు. ఆ తరువాత వసూలు చేసిన వారినుంచి ఎంపీడీవో నేరుగా డిజిటల్ లావాదేవీల ద్వారా తన ఫోన్‌కు నగదు స్వీకరించిన రికార్డులు ఇప్పటికీ ఉన్నాయన్నారు. ఈ విషయం బయటకు వచ్చినప్పటి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లను ఎంపీడీవో రకరకాలుగా వేధిచేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటికీ ఆయన ఇక్కడే కొనసాగుతూ అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభల్లో షామియానాలు వంటి కనీస సౌకర్యాలు కల్పించకుండానే రూ.60వేలను స్వాహా చేశారన్నారు. గ్రామసభలు నిర్వహించిన ఫొటోలున్నాయన్నారు. అవినీతిని ప్రశ్నిస్తున్నారన్న ఆగ్రహంతో మండలంలో 23మందికి గాను 21మంది ఫీల్డ్ అసిస్టెంట్లను విధుల నుంచి తొలగించారన్నారు. ఎంపీడీవో రఫీఖాన్ నెల్లూరులో విధులు నిర్వహించినప్పుడు అవినీతిపరుడిగా అపవాదును మూటగట్టుకున్నాడని గుర్తు చేశారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట

గూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పేదల విద్యాభివృద్ధి సీఎం చంద్రబాబు నాయుడు పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక బనిగిసాహెబ్ పేటలో బీసీ బాలికల గురుకుల పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వైసీపీ ప్రభుత్వం విద్యార్థులకు ఎటువంటి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ఇబ్బందులకు గురిచేశారని అన్నారు.

రైతును ముంచిన ఫెంగల్

● పేట సబ్‌డివిజన్‌లో తీవ్ర నష్టం
● 3725 ఎకరాల్లో దెబ్బతిన్న వరి

దొరవారిసత్రం, సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మూడు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలు రైతాంగానికి తీవ్ర నష్టం చేకూర్చాయి. ప్రధానంగా వరి సాగు చేసిన రైతులు నష్టపోయారు. లోతట్టు ప్రాంతాల్లోని వరి పొలాల్లో వరద నీరు ఇప్పటికీ తగ్గుముఖం పట్టలేదు. వర్షాలతో పాటు, కాళంగికి వరద పోటెత్తడంతో నది పరివాహక ప్రాంతాలను ముంచెత్తింది. పంటలు నీట మునగడంతో పాటు ఇసుక మేటలు వేశాయి. ప్రధానంగా కాలువలు నెర్రికాలువ, కన్నాకాలువ, పాల కాలువ, పాములకాలువ, పుచ్చకాలువల పరివాహక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. సూళ్లూరుపేట సబ్ డివిజన్ పరిధిలోని దొరవారిసత్రం, సూళ్లూరుపేట, తడ మండలాల్లో 3725 ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నట్లు వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక అంచనా. దొరవారిసత్రం మండలంలో 1480, సూళ్లూరుపేటలో 1317, తడలో 927 ఎకరాలు దెబ్బతిన్నట్లు గుర్తించారు. దొరవారిసత్రం మండలంలో కన్నాకాలువ వరద తాకిడికి కట్టువపల్లి, పూలతోట, చవటకండ్రిగ గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అలాగే ఆనేగొట్టం, కరటామిడి, తొగరాముడి, అక్కరపాక లోతట్టు ప్రాంతాల్లో వరి నీటిలో కుళ్లుతోంది. కాళంగి పరివాహక తాకిడికి దొరవారిసత్రం మండలంలో వెదురుపట్టు, ఉచ్చూరు, కుప్పారెడ్డిపాళెం, తల్లంపాడు పంచాయతీలతో పాటు, సూళ్లూరుపేట మండలంలో పడమటికండ్రిగ, ఎన్‌వీకండ్రిగ, తడలో కాదలూరు, కొండూరు, వాటంబేడు, గొల్లలమల్లు ప్రాంతాల్లో వరి పంటలు నీట మునగడంతో పాటు ఇసుక మేటలు వేశాయి. అలాగే పులికాట్ పరివాహక ప్రాంతాల్లోనూ వరి పంటలు దెబ్బతిన్నాయి.


సూళ్లూరుపేట మండలం ఎన్‌వీ కండ్రిగలో నీట మునిగిన వరి పంట

వేరుశనగ, మిరప రైతులకు స్వల్ప నష్టం

సూళ్లూరుపేట సబ్ డివిజన్‌లో మిరప, వేరుశనగ సాగు చేసిన రైతులకు వాటిల్లిన నష్టం స్వల్పమేనని అధికారులు చెబుతున్నారు. 15 హెక్టార్లలో మిరప, 10 హెక్టార్లలో వేరుశనగ నష్ట పోయినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. వాస్తవానికి మరో వారం రోజుల తరువాత సూళ్లూరుపేట ప్రాంతంలో మిరప, వేరుశనగ సాగు విస్తారంగా ఉంటుంది. ప్రస్తుత వర్షానికి ముందుస్తుగా పంటలు వేసిన రైతులు నష్ట పోయారు.

నీట మునిగిన పంటలను పరిశీలించిన కలెక్టర్

ఫెంగల్ తుపాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీటి మునిగిన పంటపొలాలను సోమవారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో కలిసి పరిశీలించారు. సూళ్లూరుపేటలోని గోకులకృష్ణ కళాశాల, పడమటి కండ్రిగ ప్రాంతాల్లో కాళంగి, పాముల కాలువ వరద ప్రవాహానికి నీట మునిగిన పొలాలను పరిశీలించి అక్కడి రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తడ, సూళ్లూరుపేట, వరదయ్యపాలెం ప్రాంతాల్లో ఎక్కువ వర్షపాతం నమోదయ్యిందన్నారు. దీంతో పంట పొలాలు నీట మునిగాయని, పలుచోట్ల రోడ్లు, చెరువులు దెబ్బతిన్నాయన్నారు. నష్టాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకొంటామన్నారు. అలాగే దెబ్బతిన్న చెరువులకు మరమ్మతులు చేస్తామని చెప్పారు. తెగిన రోడ్లను యుద్ధ ప్రాతిపదికన పునరుద్దరించడం జరుగుతుందన్నారు. పంట నష్టానాకా సంబంధించిన వివరాలతో నివేదిక రూపొందించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం కాళంగి, పాముల కాలువ నీటి ప్రవాహం కలిసే రైల్వే ట్రాక్ బిడ్డి పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో కిరణ్మయి, తెలుగుగంగ ఎస్ఈ మదన గోపాల్, వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత, ఏవో కవిత తదితరులు ఉన్నారు.

యాకసిరి చెరువుకు గండి


యాకసిరి చెరువు కట్టకు ఇసుక బస్తాలు వేస్తున్న అధికారులు

చిట్టమూరు, డిసెంబర్ 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలకు వరి పంటలు నీట మునిగాయి. ఆదివారం రాత్రి రొయ్యల కాలువకు నీటి ఉధృతి పెరగడంతో చుట్టు పక్కల వరి పంటలు నీట మునిపోయాయి. కొత్తగుంట, మల్లాం మార్గంలోని బాలచంద్రారెడ్డి ఎస్టేట్ వద్ద ఉన్న చప్టా వద్ద పోలీసులను కాపలా ఉంచి ఆ మార్గంలో రాకపోకలను ఆపేశారు. మండలంలోని యాకసిరి మేజర్ చెరువుకు గండి పడడంతో ఎంపీడీవో మనోహర్‌గౌడ్, తహసీల్దారు ప్రసాద్, ఎస్ఐ చిన్న బలరామయ్య రైతులతో కలిసి ఇసుక బస్తాలు వేసి రింగ్ బండ్ వేశారు.

పూడేరు గ్రామదేవత ఆలయంలో చోరీ


చోరీ జరిగిన ఉయ్యాలమ్మ ఆలయం

నాయుడుపేట టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడేరు గ్రామంలో గ్రామదేవత ఉయ్యాలమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆదివారం గ్రామస్తులు అమ్మవారిని నగలతో అలంకరించి పొంగళ్లు పెట్టారు. సాయంత్రం దీపాలు వెలిగించి తాళాలు వేసుకొని వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూసేసరికి ఆలయం తాళాలు పగలగొట్టి ఉండడం గుర్తించారు. అమ్మవారికి అలంకరించిన 4 సవర్ల బంగారు ఆభరణాలు, హుండీలో నగదు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో పూజలు


నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

నాయుడుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వర్ణముఖినది తీరాన వెలసిన ప్రసూనాంబసమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారు జామునే మహిళలు ఆలయానికి చేరుకొని పిండిదీపాలు వెలిగించారు. అనంతరం స్వర్ణముఖినదిలో దీపాలను మహిళలు వదిలారు.

సగం చెరువులే నిండాయి!

దక్కిలి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాన్ కారణంగా వర్షాలు కురిసి అన్ని ప్రాంతాల్లో చెరువులు నిండినా దక్కిలి మండలంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. మూడు రోజుల నుంచి మబ్బులు కమ్ముకొని జల్లు తప్ప భారీ వర్షం పడలేదు. దీంతో మండలంలో సగం చెరువులు మాత్రమే నిండాయి.

ఓజిలిలో మోస్తరు వర్షం

ఓజిలి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం మోస్తరు పడుతూనే ఉంది. మూడు రోజులుగా కురిసిన వర్షానికి పలు చెరువుల్లో నీరు చేరింది.

విద్యార్థిని చదువులకు ఆర్థిసాయం

చిల్లకూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని పారిచెర్లవారిపాళెం జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినికి కరుణ ఉన్నత చదువుల కోసం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రూ.20 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బాబు, హెచ్ఎం సుధాకర్, ప్రజేంద్రరెడ్డి, మాధవయ్య, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం నాయుడు తదితులు పాల్గొన్నారు.


విద్యార్థినికి నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు, ట్రస్ట్ సభ్యులు

తిప్పగుంటపాళెం చప్టాపైకి వరదనీరు


తిప్పగుంటపాళెం చప్టాపై ప్రవహిస్తున్న వరదనీరు

చిల్లకూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పగుంటపాళెం వద్ద ఉన్న ఉప్పుటేరు పొంగి చప్టాపైకి వరదనీరు ప్రవహిస్తోంది. దీంతో చప్టాకు అవతలి వైపు ఉన్న సుమారు వంద కుటుంబాల వరకు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. సోమవారం వర్షం కురవకపోయినప్పటికీ పైప్రాంతాల నుంచి వరద ఉప్పుటేరుకు చేరుకోవడంతో చప్టాపైకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తహసీల్దారు శ్రీనివాసులు సిబ్బందితో కలిసి ఉప్పుటేరును పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. ఎలాంటి ఇబ్బందికర పరిస్థితులు తలెత్తకుండా ఉప్పుటేరు వద్ద సిబ్బందిని నియమించారు.

మంచి అలవాట్లతో ఆరోగ్యం



విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్

గూడూరు అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి ఆరోగ్యంగా ఉండాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివప్రసాద్ అన్నారు. సోమవారం స్థానిక ఎస్‌కేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని విద్యార్థులకు వ్యాస రచన, వకృత్వ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు, చెడు అలవాట్లుకు దూరంగా ఉండాలన్నారు. ఎయిడ్స్ రహిత సమజాన్ని స్థాపించేందుకు అందరం కలిసి కట్టుగా ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకుని వచ్చేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, విజయ మహేష్, ఝాన్సీ, వాణి, నారాయణరాజు, శ్రీధర్ శర్మ, కోటీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పార్కు సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందాడు. సోమవారం ఉదయం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనాస్థలికి చేరుకున్న వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా పార్కు సమీపంలో ఆ వృద్ధుడు సంచరిస్తున్నట్లు స్థానికులు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆధార్ సేవలను విస్తరిస్తాం


ఆధార్ సేవలను పరిశీలిస్తున్న ఎంపీడీవో వేణు

కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఐటీడీఏ సహకారంతో ఏర్పాటైన ఆధార్ కేంద్రం సేవలను విస్తరిస్తామని ఎంపీడీవో వేణు తెలిపారు. సోమవారం ఆయన ఆధార్ కేంద్రంలోని సేవలను స్వయంగా పరిశీలించారు. ఈ కేంద్రం ద్వారా కేవలం గిరిజనులకే కాకుండా గిరిజనేతరులకు కూడా ఉచితంగా ఆధార్ సేవలు అందిస్తామన్నారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు కిరణ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

వరద బాధితులకు అన్నదానం


అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని వట్రపాలెంలో టీడీపీ నాయకులు సోమవారం పేదలకు అన్నదానం చేశారు. వట్రపాలెం ముంపునకు గురికావడంతో అక్కడ నివాసం ఉన్న ప్రజలకు తెలుగు యువత ఉపాధ్యక్షుడు పి.మాధవ నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతనిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, వాకచర్ల రమేష్, సురేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పరవళ్లు తొక్కుతున్న స్వర్ణముఖి

ఉప్పొంగిన మామిడి కాలువ, బకింగ్‌హామ్ కెనాల్


మామిడి కాలువ పొంగి రోడ్డుపై వరదనీరు రావడంతో రాకపోకలకు ఇబ్బందిపడుతున్న రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాల ప్రజలు

కోట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలో సోమవారం కూడా ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీటితో గూడలి వద్ద ప్రవహిస్తున్న స్వర్ణముఖి పరవళ్లు తొక్కుతోంది. వరద నీరంతా స్వర్ణముఖి నుంచి చల్లకాలువ నదిలోకి ప్రవహిస్తోంది. అదేవిధంగా ఊనుగుంటపాళెం వద్ద మామిడి కాలువ పొంగి చప్టాపైకి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రుద్రవరం, ఊనుగుంటపాళెం గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. దైవాలదిబ్బ, పుచ్చలపల్లి వద్ద స్వర్ణముఖి పొర్లు కట్టలు కోతకు గురై బలహీనంగా ఉండటంతో స్వర్ణముఖి పరివాహక గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గోవిందపల్లి వద్ద బకింగ్‌హమ్ కెనాల్‌కు వరద పొటెత్తడంతో చప్టాపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. దీంతో గోవిందపల్లిపాళెం మత్స్యకార గ్రామానికి రాకపోకలు ఆగిపోయాయి.

వరదనీటిలో వట్రపాలెం


గోపాల్‌రెడ్డిపాలెం గిరిజన కాలనీ నివాసాల చుట్టూ వర్షపునీరు

సూళ్లూరుపేట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ పరిధిలో ఉన్న వట్రపాలెం ప్రాంతానికి చిన్నపాటి వర్షమొచ్చిన ముంపు తప్పడం లేదు. కాళంగికి వరద వస్తే నది అంచునే ఉన్న ఈ ప్రాంతంలోని ఇళ్లలోకి నీరు వచ్చేస్తుంది. ఫెంగల్ తుపాన్ ప్రభావంతో మూడు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు సూళ్లూరుపేటలో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయంగా మారాయి. కాళంగి నది అంచునే ఉన్న వట్రపాలెం ముంపునకు గురైంది. సోమవారం కూడా ఇళ్లన్నీ నీటి మడుగులోనే ఉండడంతో వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా కారిజాత రోడ్డులో ఉన్న గిరిజన కాలనీలోనూ వరద నీరు తగ్గలేదు.

చేనేతలకు సాయం అందించేందుకు చర్యలు


మగ్గం గుంటలు పరిశీలిస్తున్న వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉమామహేశ్వర రావు, తెలుగు మహిళ మట్టం శ్రావణి

గూడూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తుపాను కారణంగా మగ్గం గుంతల్లో నీరు చేరి ఇబ్బందులకు గురైన చేనేతలకు సాయం అందించేలా చర్యలు చేపడుతామని వీవర్స్ డెవలప్‌మెంట్ అధికారి ఉమామహేశ్వర రావు అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో మగ్గం గుంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను కారణంగా మగ్గం గుంతల్లోకి నీరు చేరడంతో నివేదికలను రూపొందించి ఉన్నతధికారులకు అందజేసి ప్రభుత్వం నుంచి సాయం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి మాట్లాడుతూ చెన్నూరు గ్రామంలో 200పైగా మగ్గం గుంతల్లో తుఫాను కారణంగా నీరు చేరడంతో పనులు లేక చేనేతలకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన జిల్లా వీవర్స్ అధికారులతో చర్చించి నష్టలను అంచనా వేయాలని, బాధితులకు పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారని తెలిపారు. కార్యక్రమంలో కటికాల శ్రీనివాసులు, రాజనాల, వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

9న అప్రెంటీస్‌షిప్ మేళా

తిరుపతి(విద్య), డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్‌షిప్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన తిరుపతి ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ప్రైమినిస్టర్ నేషనల్ అప్రెంటీస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 10 గంటలకు మేళా ప్రారంభమవుతుందని, ఇతర వివరాలకు 9441647174, 9533717170లలో అప్రెంటీస్‌షిప్ అడ్వైజర్ గంగాధరాన్ని సంప్రదించాలని సూచించారు.

6న జిల్లాకు మంత్రి సుభాష్ రాక

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఈ నెల 6న జిల్లా పర్యటనకు రానున్నారు. అనంతపురం నుంచి బయలుదేరి శుక్రవారం ఉదయం 6.30 గంటలకు తిరుపతి రైల్వేస్టేషన్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం వివిధ అంశాలపై కలెక్టరేట్లో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తారు. ఆదేరోజు రాత్రి రైల్వేస్టేషన్‌కు చేరుకుని తిరుగు పయనమవుతారని కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం తెలిపారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి: ఆదిమూలం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

సత్యవేడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి మండలాన్ని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే ఆదిమూలం కోరారు. నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ సింధు అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ఎమ్మెల్యే ఆదిమూలం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని ద్వారకానగర్, కొట్టకాడు కాజ్‌వేల నిర్మాణానికి సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తైందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఫెంగల్ తుఫాన్‌కు జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పలువురు సభ్యులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించారు. ఎంపీడీవో బాలాజీ నాయక్ మాట్లాడుతూ... పంచాయతీల్లో నెలకొన్న సమస్యలన్నింటినీ దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. సమావేశంలో తహసీల్దార్ హనుమాన్ నాయక్, ట్రాన్స్‌కో ఈఈ ఆశీర్వాదం, ఏడీ రమేష్, వైస్ ఎంపీపీ కుమారి, ఎంపీటీసీ ప్రేమ, సర్పంచ్ సుధ, వీఆర్వో నాగభూషణం తదితరులు పాల్గొన్నారు. కాగా మండల మీట్‌కు జడ్పీటీసీ సభ్యురాలు సుమతి గైర్హాజరు కావడం గమనార్హం.

చెన్నంపల్లి రోడ్డు పరిశీలన


కోట్టుకుపోయిన చెన్నంపల్లి రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నంపల్లికి వెళ్లే రోడ్డు నక్కల వాగు ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో ఆ గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. ఈ క్రమంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు సోమవారం కోతకు గురైన చెన్నంపల్లి రోడ్డును పరిశీలించారు. పీఆర్ డీఈ వినోద్‌రెడ్డి, ఏఈ రవితేజ, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌బాబు, టీడీపీ నాయకులు రోశయ్య తదితరులున్నారు.

● శాశ్వత రోడ్డు నిర్మాణం కలేనా?

దశాబ్దాలుగా చెన్నంపల్లికి వెళ్తే దారి నక్కలవాగుపై మట్టిరోడ్డుగా ఉండేది. యేటా భారీ వర్షాలకు కొట్టుకుపోతోంది. గత యేడాది కూడా కొట్టుకుపోయింది. అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ తనసొంత నిధులతో ఆ గ్రామానికి నక్కలవాగుపై తాత్కాలిక రోడ్డు ఏర్పాటు చేశారు. గత ఐదేళ్ల పాలనలో ప్రభుత్వం కానీ, అధికారులు కానీ చెన్నంపల్లికి పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఆలోచించలేదు. అప్పటి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి రూ.6కోట్లతో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అయితే ఆ తరువాత అటువైపు కూడా చూడలేదు. దీంతో రోడ్డు నిర్మాణం తూతూమంత్రంగా తేలింది. కూటమి ప్రభుత్వంలో అయినా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చొరవ తీసుకుని చెన్నంపల్లికి శాశ్వత రోడ్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ముస్లింపాళెం వద్ద కొండచిలువ


రోడ్డు దాటుతున్న కొండచిలువ

వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్లింపాళెం గ్రామానికి వెళ్లే దారిలో ఓ భారీ కొండచిలువ సోమవారం రాత్రి హల్‌చల్ చేసింది. దీంతో గ్రామస్తులు ఆందోళనకు గురయ్యారు. వారు మాట్లాడుతూ రాత్రిపూట కొండచిలువ సంచరిస్తోందని దాని కారణంగా తమ కోళ్లు మాయమవుతున్నాయన్నారు. సంబంధిత అధికారులు స్పందించి కొండచిలువను పట్టి అటవీప్రాంతంలో వదిలివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు


గంజాయి విక్రేత అరెస్టు చూపుతున్న పోలీసులు

నారాయణవనం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్లు నారాయణవనం రూరల్ సీఐ రవీంద్ర తెలిపారు. ఎస్ఐ రాజశేఖర్ సిబ్బందితో మండలంలోని కీళగరం చెరువు కట్టపై అనుమానాస్పదంగా తిరుగుతున్న వెంకటేష్‌ని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా రెండు కిలోల గంజాయి ఉన్నట్టు గుర్తించారన్నారు. నిందితుడిని విచారించగా తిరుపతివాసిగా తేలిందన్నారు. తహసీల్దార్ సమక్షంలో నిందితుడిని అదుపులోనికి తీసుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు తెలిపారు. గత సంవత్సరం కొయ్యూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో మరో కేసులో వెంకటేష్ నిందితుడిగా ఉన్నాడని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు



బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుక్కంబాకం, కాంపాళెం దళితవాడలో ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురై సరఫరా నిలిచిపోయింది. అలాగే విద్యుత్ స్తంభాలు నేల కొరిగాయి. ఈక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు స్తంభాలను నిలబెట్టారు. ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. ఏఈ చలపతి సహా సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతోనే ఎయిడ్స్ నివారణ

ఏర్పేడు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముందస్తు జాగ్రత్త చర్యలతో నివారించుకోవడం తప్ప మరో మార్గం లేని వ్యాధి ఎయిడ్స్ అని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.వెంకటసుబ్బమ్మ అన్నారు. ఎయిడ్స్ దినం సందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అవగాహన కల్పించారు. యుతవ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ వ్యాధి బారిన పడిన బాధితుల్లో రాష్ట్రం దేశంలో మూడో స్థానంలో ఉందన్నారు.

వేలం పాటను పారదర్శకంగా నిర్వహించండి


పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలో వేలంపాటను పారదర్శకంగా నిర్వహించాలని మాజీ సర్పంచ్ జ్యోతినారాయణ, మాజీ ఉప సర్పంచ్ జీకే.మునీర్, జనసేన నాయకులు నగరం భాస్కర్, వార్డు సభ్యుడు రాజేష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం పంచాయతీ కార్యదర్శి మణికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైసీపీ హయాంలో ఇష్టానుసారంగా వ్యవహరించి నెలబాడుగలకు అప్పగించి పంచాయతీ ఆదాయానికి భారీగా గండి కొట్టారన్నారు. ప్రస్తుతం పంచాయతీకి ఆదాయం చేకూరేలా వ్యవహరించాలని కోరారు. వేలం పాటను బహిరంగంగా డీఎల్‌పీవో సమక్షంలో నిర్వహించాలన్నారు. నామినేషన్ల పద్ధతిలో గదులను కట్టబెట్టాలని చూస్తే అడ్డుకుంటామని హెచ్చరించారు.

నిత్యం ట్రా'ఫికర్'



వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవర్ధనపురం వంతెన వద్ద నిత్యం ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు. శ్రీకాళహస్తి - తడ మార్గ మధ్యంలో గోవర్ధనపురం వంతెన ఉంది. ఈ మార్గంలో నిత్యం ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులు, పరిశ్రమలకు వెళ్లేవారు పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు వెడల్పుగా లేకపోవడంతో వాహనాలు నిత్యం స్తంభించిపోతున్నాయి. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

పాఠశాల చుట్టూ నీరు



కేవీబీపురం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కళత్తూరు ప్రాథమిక పాఠశాల చుట్టూ నీరు నిల్వ ఉంది. దీంతో తరగతి గదుల్లో నీరు చేరకుండా సిమెంటుతో కట్ట వేశారు. అయితే పాఠశాలకు విద్యార్థులు నీటిలో దిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి మట్టి తోలించి ఎత్తు పెంచాలని పలువురు కోరుతున్నారు.

మృత్యుంజయుడికి వేదోక్తంగా పూజలు

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న మృత్యుంజయ స్వామికి సోమవారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. పాలు, పంచామృతం, చందనం, విభూది, పచ్చకర్పూరంతో అభిషేకించారు. అనంతరం గజమాల, వెండి నాగాభరణంతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

దిగువకు అరణియార్ జలాలు



పిచ్చాటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏకైక మధ్య తరహా ప్రాజెక్టు అరణియార్ జలాశయం తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు నిండుకుండలా మారింది. గతంలో 24 అడుగులు మేర ఉన్న ప్రాజెక్టు నీటిమట్టం సోమవారం సాయంత్రానికి 29.5 అడుగులకు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 32 (1.85 టీఎంసీలు)అడుగులు కాగా 31 అడుగుల మేర నీటిని నింపుతున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు ఎగువన అరుణానది, యాలం కాలువల ద్వారా 4 వేల క్యూసెక్కులు ప్రాజెక్టుకు చేరుతోంది. ఆదివారం ఎమ్మెల్యే ఆదిమూలం ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి 1000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.779 టీఎంసీలు నిల్వ ఉంది. దీంతో రిజర్వాయర్‌కు చెందిన ఆయకట్టు పదివేల ఎకరాలు సమృద్ధిగా పండుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట


ఎక్స్‌కవేటర్ సాయంతో మురుగు తొలగింపు

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని 22వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఎన్.బుజ్జి అన్నారు. ఎన్టీఆర్ నగర్, తెలుగుగంగ కాలనీల వద్ద మురుగు కదలకుండా తిష్ట వేసింది. ఈ ప్రాంతంలోనే ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాల, నివాస గృహాలున్నాయి. దీంతో వారు ఆ దుర్గంధం భరించలేక బుజ్జి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు. దీంతో సోమవారం అధికారులు ఆ ప్రాంతంలో మురుగు, వ్యర్థాలను తొలగించి సమస్యను పరిష్కరించారు.

బంగారు గొలుసు అప్పగింత



శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయానికి సోమవారం పట్టణానికి చెందిన శ్రీనివాసులు దంపతులు దర్శనార్థం వచ్చారు. దర్శించుకునే సమయంలో వారి బంగారు గొలుసు కిందపడిపోయింది. ఆ చైనును భక్తులు ఆలయ సిబ్బందికి అందజేశారు. తాము బంగారు గొలుసు పోగొట్టుకున్న విషయాన్ని గ్రహించిన శ్రీనివాసులు దంపతులు ఆలయ అధికారులను సంప్రదించారు. వారు సీసీ ఫుటేజీని పరిశీలించి గొలుసును అప్పగించారు.

ఎయిడ్స్ అవగాహన ర్యాలీ

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నరసింహవర్మ మాట్లాడుతూ... ఆరోగ్యకరమైన సమాజం దేశాభివృద్ధికి ఎంతో అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థుల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గంగారామ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో స్టార్టర్ దగ్ధం



పిచ్చాటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త గొల్లకండ్రిగ గ్రామ తాగునీటి మోటరు స్టార్టర్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. యువకుడు ధైర్యం చేసి స్టార్టర్‌కి కనెక్షన్ ఉన్న విద్యుత్ తీగను కర్ర సాయంతో వేరు చేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ కార్యదర్శి, సర్పంచు సంఘటనా స్థలానికి చేరుకుని యుద్ధ ప్రాతిపదికన మరో స్టార్టర్‌ను ఏర్పాటు చేసి తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకం లేకుండా చూశారు.

శాశ్వత రోడ్డు నిర్మించండి



వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని చావాలి లింగ నాయుడుపల్లి పంచాయతీలోని చావాలి హరిజనవాడకు శాశ్వత రోడ్డు నిర్మాణం చేపట్టాలని సర్పంచు వేణు కోరారు. అదే విధంగా చావాలి లింగమనాయుడుపల్లికి ఇరువైపులా మారేడు కాలువ ప్రవహిస్తోందని ప్రతి వర్షాకాలంలో గ్రామానికి రాకపోకలు స్తంభిస్తున్నాయన్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వంతెన నిర్మించాలని కోరారు.

సంతవేలూరు చెరువు పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రమాదకరంగా మారిన సంతవేలూరు చెరువును కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం పరిశీలించారు. చెరువు మరమ్మతులకు రూ.7లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. చెరువు ప్రమాదకరంగా ఉన్నా గత ఐదేళ్లుగా నిర్వహణ చేపట్టకపోవడంతో గండి పడుతుందేనని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. గండి పడితే పొలాల్లో ఇసుక మేట వేయడమే కాకుండా గ్రామం మునిగిపోయే ప్రమాదం ఉందన్నారు. నెలరోజుల్లో కట్ట మరమ్మతులు చేపట్టాలని, ప్రస్తుతానికి రింగ్‌బండ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా పులిబొంద, మార్లమడుగు కాలువలకు ఆరేళ్ల కిందట గండి పడినా గత ఐదేళ్లుగా నిధులు మంజూరు కాకపోవడంతో నీరు పొలాలపై మళ్లడంతో నష్టపోతున్నామని రైతులు కలెక్టర్‌కు వివరించారు. గండి మరమ్మతులకు అంచనా వేసి నివేదిక పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదే విధంగా అంబూరులో మేత బీడు భూములు ఆక్రమణకు గురయ్యాయని టీడీపీ నాయకుడు ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేసి వారం రోజుల్లో ఆక్రమణలను తొలగించాలని తహసీల్దారు రాజశేఖర్‌ను ఆదేశించారు. ఎంపీడీవో ప్రసాద్, అధికారులు మదన గోపాల్‌రెడ్డి, రత్నాకర్ రెడ్డి, రాజ్‌కుమార్, టీడీపీ నాయకులు సుధాకర్, బాబురెడ్డి, ఆయకట్టు రైతులు పాల్గొన్నారు.

ఆలయం పక్కన చెత్తకుండీని తొలగించరూ...


కరుమారియమ్మ ఆలయ ప్రహరీ పక్కన చెత్తకుండీ

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కరుమారియమ్మ ఆలయంలో శివాలయం సన్నిధి పక్కన ఏర్పాటు చేసిన చెత్తకుండీని తొలగించాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. కరుమారియమ్మ ఆలయ ప్రాంగణంలో శివాలయం, అయ్యప్ప తదితర దేవతల సన్నిధులున్నాయి. ఈ ఆలయానికి అను కుని చెత్తకుండీని ఏర్పాటు చేశారు. ఇక్కడ పేరుకుపోయిన చెత్తాచెదారాల నుంచి దుర్వాసనలు వెదజల్లుతోంది. వెంటనే ఆలయం పక్కన నుంచి చెత్తకుండీని తొలగించి మరో ప్రదేశంలో ఏర్పాటు చేయాలని భక్తులు కోరుతున్నారు.

రోగులకు సకాలంలో వైద్యం అందించాలి


పరీక్షలను పరిశీలిస్తున్న వైద్యులు

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు సకాలంలో వైద్యం అందించాలని జిల్లా టాస్క్‌ఫోర్సు అధికారి డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. శ్రీరామ్‌నగర్ కాలనీలోని పీహెచ్‌సీని సోమవారం ఆయన తనిఖీ చేశారు. గర్భిణులకు ఆరోగ్య సిబ్బంది అందిస్తున్న వైద్య పరీక్షలను పరిశీలించి పలు సూచనలు చేశారు. పీహెచ్‌సీ పరిధిలోని చిన్నపిల్లలకు టీకాలను సకాలంలో అందించాలన్నారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం గజేంద్రనగర్, భాస్కరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. బాలు, శైలజ, స్రవంతి, రెడ్డి రూపేష్ తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువులపై రైతులకు అవగాహన

పిచ్చాటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రైతులు సమగ్ర పోషక యాజమాన్యంలో భాగంగా పంటలకు అవసరమైన మేరకే ఎరువులను వినియోగించే రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మీదేవి తెలిపారు. సోమవారం స్థానిక ఆర్‌బీకే వద్ద సత్యవేడు వ్యవసాయ డివిజన్ పరిధిలోని రైతు సేవా కేంద్రాల వీఏఏలు, వీహెచ్ఏలకు సామర్థ్యాల పెంపుపై శిక్షణ ఇచ్చారు. వరిలో వచ్చే తెగుళ్ల, యాజమాన్య పద్ధతులను వివరించారు. ఈ క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారి రాధారాణి, ఏడీ సుబ్రహ్మణ్యం, ఏవోలు సంజీవరెడ్డి, మురళి, ద్వారకనాథ్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చేనేత అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన


మగ్గాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి):ఫెంగల్ తుఫాన్ కారణంగా వరదయ్యపాళెం మండలంలో సుమారు 150 మగ్గాలకు నష్టం వాటిల్లిందని క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని ఆదివారం తహసీల్దార్‌కు చేనేత దేవాంగ నాయకుడు గుత్తి త్యాగరాజు వినతిపత్రం అందజేశారు. ఇదే విషయాన్ని జిల్లా చేనేత ఉప సంచాలకుడి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన జిల్లా యంత్రాంగం సోమవారం మండలంలోని గోవర్ధనపురం, పద్మావతిపురం, మరదవాడ, వరదయ్యపాళెం, కంచరపాళెం, బాలసుబ్రహ్మణ్యంపేట, కారిపాకం తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో మగ్గాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ అభివృద్ధి అధికారి కిరణ్‌కుమారి, యూనియన్ నాయకులు బుర్ర కృష్ణమూర్తి, బీరక వెంకటరాయులు, పృథ్వీ రవి తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు చెరువులకు గండ్లు పడకుండా పటిష్ఠ చర్యలు చేపడుతున్నట్టు సత్యవేడు ఇరిగేషన్ డీఈ రత్నారెడ్డి తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో చెరువుల భద్రతపై తహసీల్దార్, ఏఈలతో ఆయన సమీక్షించారు. మండలంలో అన్ని చెరువులు వర్షాలకు నిండి ఉన్నాయని ప్రస్తుతం ఎలాంటి ప్రమాదం లేదన్నారు. వర్షాలు కొనసాగితే గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నట్లు డీఈ తెలిపారు.

విప్పమానుపట్టెడ పూర్వ కార్యదర్శులకు నోటీసులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రేణిగుంట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విప్పమానుపట్టెడ పంచాయతీ పూర్వ కార్యదర్శులకు విచారణాధికారి ఈవోపీఆర్డీ ప్రభురావు నోటీసులు జారీ చేశారు. ఈ పంచాయతీలో రూ.1.34కోట్లు దుర్వినియోగం అయ్యాయంటూ ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు స్పందనలో ఫిర్యాదు చేయగా ఈ విషయమై ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో విచారణాధికారిగా ఈవోపీఆర్డీని నియమించిన విషయం తెలిసిందే. రెండు మూడు రోజులుగా విచారణ చేస్తున్న ఈవోపీఆర్డీ పలు రికార్డులను పరిశీలించి ఇది వరకు ఇక్కడ కార్యదర్శులుగా పని చేసిన ముగ్గురికి నోటీసులిచ్చారు. అలాగే సర్పంచుకు సర్క్యులర్ జారీ చేసి ఈనెల 3న మంగళవారం విచారణకు హాజరుకావాలని ఆదేశించినట్లు విచారణాధికారి తెలిపారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టండి


గుంతలమయమైన చెంబేడు రోడ్డు

శ్రీకాళహస్తి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు టి.దామోదర్ రెడ్డి, బాలగురవం బాబు డిమాండ్ చేశారు. తుఫాన్ ధాటికి దెబ్బతిన్న తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి వద్ద చెంబేడు రోడ్డుపై నిరసన వ్యక్తం చేవారు. గుంతల్లో వరి నాటారు. ప్రభుత్వం స్పందించి వెంటనే రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాని, కరీముల్లా, మునిరాజా తదితరులు పాల్గొన్నారు.


కాంగ్రెస్ నాయకుల నిరసన

గుంతలమయమైన గ్రామీణ రోడ్లు


జీఎన్‌కండ్రిగ రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వర్షాలకు గ్రామీణ రోడ్లు గుంతలమయమై ప్రయాణం దుర్భరంగా మారింది. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామీణ రోడ్ల నిర్వహణ గాలికి వదిలేయడంతో ఈ పరిస్థితి తలెత్తింది. వర్షాలతో ఆర్.అనంతపురం, జీఎన్‌కండ్రిగ, ఆలత్తూరు, పూసలపల్లి, చిన్నాయ్యగుంట తదితర గ్రామీణ రోడ్లు దెబ్బతిని ప్రయాణం కష్టంగా మారింది. గుంతలు ఎక్కడున్నాయో తెలియక ద్విచక్రవాహనదారులు ప్రమదాల బారిన పడుతున్నారు.


ఆర్ అనంతపురం రోడ్డు